

# సూర్య

www.suryaa.com

19 వ వసంతంలోకి ...

గురువారం,30 అక్టోబర్ 2025

కాకినాడ జిల్లా
కోనసీమ జిల్లా
తూర్పు గోదావరి జిల్లా
అల్లూరి సీతారామరాజు జిల్లా

8 పేజీలు



# మొంథా తుఫాను ప్రమాదం తప్పింది..

## కానీ చాలా నష్టపోయాం

- తుఫాన్ బాధితులకు రూ.3 వేలు సహాయం
- మత్స్యకార కుటుంబాలకు 50 కేజీల బియ్యం
- ఇతర కుటుంబాలకు 25 కేజీల బియ్యం
- పేలుడు మృతుల కుటుంబాలకు రూ.15 లక్షల నష్టపరిహారం

**- ముఖ్యమంత్రి చంద్రబాబు**






ఉమ్మడి గోదావరి జిల్లాల సూర్య బ్యూరో :

మొంథా తుఫాన్ పెను విపత్త అని, దీనివల్ల ఏపీకి తీవ్ర నష్టం వాటిల్లిందని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు వ్యాఖ్యానించారు. గతంలో తుఫాన్‌ల సమయంలో పనిచేసిన అనుభవం తనకుందని గుర్తు చేశారు. మొంథా తుఫాన్‌పై ముందుగానే ప్రణాళిక సిద్ధం చేసుకున్నామని, అల్లవరం మండలం ఓడలరేవు వద్ద బుధవారం మీడియాతో మాట్లాడుతూ అన్నారు. తుఫాన్ బాధితులను సిఎం పరామర్శించారు. బాధితులకు నిత్యావసరాలు, రూ.3 వేలు పరిహారం అందచేశారు. మత్స్యకారుల కుటుంబాలకు 50 కిలోల బియ్యం అందించారు. కోనసీమ జిల్లాలో వరి, అక్వా, ఉద్యాన పంటలు దెబ్బతిన్నాయని చెప్పుకొచ్చారు. ఆస్తి నష్టంపై కేంద్ర ప్రభుత్వానికి నివేదిక ఇస్తామని స్పష్టం చేశారు. కౌలు రైతులకు పరిహారం అందిస్తామని భరోసా కల్పించారు.

- మిగతా 2 లో..





## సిఎం చంద్రబాబు ఏరియల్ విజిట్

### ప్రజలకు అండగా ఉంటానని భరోసా

- మొంథా తుఫాన్ ప్రభావిత ప్రాంతాల్లో సిఎం హెలికాప్టర్‌లో పర్యటన
- జిల్లాలో తీవ్ర పంటనష్టం ఏర్పడింది
- సత్వరమే స్పందించి చాలావరకు నష్టాన్ని నియంత్రించగలిగాం : సిఎం

ఉమ్మడి గోదావరి జిల్లాల సూర్య బ్యూరో :

మొంథాతుఫాన్ ప్రభావిత ప్రాంతాల్లో సిఎం చంద్రబాబు ఏరియల్ విజిట్ నిర్వహించారు. బుధవారం కోనసీమ జిల్లాలో హెలికాప్టర్‌తో పైనుంచి పరిస్థితిని సమీక్షించారు. తీవ్రమైన గాలులు, భారీ వర్షాల కారణంగా దెబ్బతిన్న ప్రాంతాలను

- తరువాయి 2లో..

# శభాష్ కలెక్టర్.. సెల్యూట్ ఎస్పీ



- తుఫాన్‌ను విజయవంతంగా ఎదుర్కొన్న యంత్రాంగం
- ముందుండి నడిపించిన కలెక్టర్ షాన్మోహన్, ఎస్పీ బిందు మాధవ్
- తుఫాను వర్షాల్లో తీసుకోవాల్సిన చర్యలపై దిశానిర్దేశం
- కలెక్టర్ స్వయంగా పాల్గొని అందించిన సహాయక చర్యలు
- అడుగడుగునా ప్రజల భద్రతపై ప్రత్యేక తపన
- చిన్న స్థాయి ఉద్యోగం నుంచి పై ఉద్యోగి వరకు అందించిన సేవలు చిరకాలం గుర్తుండిపోతాయి...

## ప్రజలు ప్రశంసలు కురిపిస్తున్నారు

ఉమ్మడి గోదావరి జిల్లాల సూర్య బ్యూరో :

మొంథా తుఫాన్‌ను కాకినాడ జిల్లా యంత్రాంగం ఐక్యతతో విజయవంతంగా ఎదుర్కొని జిల్లా ప్రజల ప్రాణ, ఆస్తి, పంట పొలాలకు నష్టం కలగకుండా చర్యలు తీసుకోగలిగారని ప్రజలు వెయ్యినోళ్ల ప్రశంసలు అందిస్తున్నారు. కలెక్టర్ షాన్మోహన్, ఎస్పీ బిందుమాధవ్‌ల దిశా నిర్దేశం, పర్యవేక్షణలో యంత్రాంగంఅనుక్షణం అప్రమత్తంగా ప్రణాళికాబద్ధంగా వ్యవహరిం చారు. కలెక్టర్ షాన్మోహన్ సగిలి ముందుండి పర్యవేక్షణ చేపట్టి ప్రతిక్షణం పరిస్థితులను అంచనాతో పరిశీలించారు. వర్షాలు, ఈదురుగాలుల తీవ్రత నేపథ్యంలో అధికారులతో తరచూ సమీక్షలు నిర్వహించి అవసరమైన చర్యలపై స్పష్టమైన దిశానిర్దేశం చేశారు. జిల్లాలోని సముద్ర తీరప్రాంతాలు, లోతట్టు ప్రాంతాల్లో పర్యటించి ప్రజల భద్రతపై ప్రత్యేక దృష్టి పెట్టారు.విపత్కర పరిస్థితుల్లో తమ సేవలతో ప్రజల మనసులను దోచుకోవడమే కాక...వారితోశభాష్ కలెక్టర్ షాన్మోహన్... సెల్యూట్ ఎస్పీ బిందుమాధవ్ అనిపించుకున్నారు. తుఫాన్‌ను విజయ వంతంగా ఎదుర్కొన్న జిల్లా యంత్రాంగం సేవలపై ఉమ్మడి గోదావరి జిల్లాల సూర్య బ్యూరో అందించిన క్షేత్రస్థాయిలో పరిశీలనాత్మక కథనం..

- మిగతా 2 లో..





# మొంథా తుఫాను ప్రమాదం తప్పింది...

**ఉమ్మడి గోదావరి జిల్లాల సూర్య బ్యూరో :**

మొంథా తుఫాను ప్రభా వంతో నష్టపోయిన రైతులకు, బాధితులకు రాష్ట్ర ప్రభుత్వం అండగా నిలిచి ఆదుకుంటుందని రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు భరోసాను ఇచ్చారు. బుధ వారం అంబేద్కర్ కోనసీమ జిల్లా అల్లవరం మండల పరిధిలోని ఓడలరేవు నందు బహుళ ప్రయోజనాల తుఫాన్ఆశ్రయ భవనంలో ఆశ్రయం పొందుతున్న నిర్వాసితులకు ఆర్థికసహాయం పంపిణీ,25కేజీలు బియ్యం నిత్యావసరా లు బెండమూరిలంక శివారు అరకట్లపాలెం ప్రాం తంలో వరి సాగు క్షేత్రాలలో నష్టపోయిన పంటలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన తుఫాను ప్రభావంతో జరిగిన నష్టాలపై ప్రభుత్వం అన్నివిధాలఆదుకోవడం జరుగుతుందన్నారు. ఓడలరేవులో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తుఫాన్బాధితులను పరామర్శించారు. బాధితులు ఎవరు భయాందోళనకు గురికావాల్సిన అవసరం లేదని, ప్రభుత్వం అన్ని విధాల అండగా నిలిచి ఆదుకుంటుందని స్పష్టం చేశారు. ఆర్థిక సహాయం పంపిణీ కార్యక్రమాన్ని స్థానికంగా ఆయన ప్రారంభించారు. ప్రభావిత కుటుంబాలకు అవసరమైన సరుకులు, మత్స్యకార చేనేత రంగ కుటుంబాలు గత ఐదు రోజులుగా తుఫాన్ హెచ్చరికలతో ఉపాధిని కోల్పోయిన నేపథ్యంలో ఆయా కుటుంబాల జీవన భృతికి 50 కిలోలు బియ్యంఉచితంగా అందిస్తున్నా మన్నారు. ఒక్కోబాధితవ్యక్తికి రూ. 1,000, కుటుంబానికి గరిష్టంగారూ. 3,000 తాత్కాలిక ఉపశమనంగా అందించడం జరుగుతుందన్నారు. ఆరోగ్య సంరక్షణకై మొబైల్ క్లినిక్స్, నిర్వహించడం జరుగుతుందన్నారు. తుఫాన్ ప్రభావంతో నేలకొరిగిన కొబ్బరి, భారీ వృక్షాలను, విద్యుత్ పోల్స్ను తొలగించి రవాణా విద్యుత్ సరఫరా పునరుద్ధరణ చర్యలు పూర్తి చేయడం జరిగిందన్నారు. ఈ సందర్భంగా రైతులు ముఖ్యమంత్రితో తమకు సాగునీరు ఆలస్యంగా విడుదలవుతుందని, ముందుగానే విడుదల చేస్తే తమ పంటలను తుఫాన్లు బెడద నుండి కాపాడుకోగలుగుతామని అదేవిధంగా జిల్లా వ్యాప్తంగా మురుగు కాలువలలో పూడికలు తీయించడంతో తమ పొలాలు ముంపు బారిన పడవని ముక్తకంఠంతో కోరారు. తినే సన్న రకం వరి వంగడాలు వేయాలని సీఎం సూచించగా తమ ప్రాంతానికి సన్న రకాలు పెద్దగా దిగుబడిని ఇవ్వవని, స్థానిక భూసారాన్ని బట్టి స్వర్ణ రకమే మంచి దిగుబడిని ఇస్తుందని రైతులు తెలుపగా, ముఖ్యమంత్రి శాస్త్రవేత్తలతో మాట్లాడుతూ సన్న రకాలవరివంగడాలు సాగు చేసేందుకు గల అవకాశాలపై అధ్యయనంచేసి సన్న రకాలను ప్రోత్సహించాలని సూచించారు. పంట నష్టాలను, నష్ట వివరాలను అధికారులు త్వరితంగా శాస్త్రీయంగా పారదర్శకంగా రూపొందించాలని అధికారులను ఆదేశించారు. మొంథా తుఫాన్ ఉపశమన ప్రక్రియ వేగవంతంగా జరుగుతోందన్నారు. వరి పంట కోత దశలో ముంపు బారిన పడి నష్టపోయిందని రైతులు సాగు క్షేత్రాలకు ముఖ్యమంత్రిని తీసుకువెళ్లి ప్రత్యక్షంగా చూపించగా నష్టపోయిన రైతులందరినీ ప్రభుత్వం ఆర్థికంగా ఆదుకోవడం జరుగుతుందని ఎవరు భయాందోళనలకు గురికా వలసిన అవసరం లేదన్నారు. అదేవిధంగా పంటలపై బీమా ప్రీమియం చెల్లించి ఉంటే ఆ విధంగా కూడా నష్టపరిహారం ఇప్పించేందుకు ప్రభుత్వం పాటు పడుతుందన్నారు. మొంథా తుఫాన్ ప్రభావంతో కోనసీమ జిల్లాలో నష్టం వాటిల్లినప్పటికీ కోనసీమప్రాంతంపెనుముప్పునుంచి బయటపడిందన్నారు. కోనసీమ ప్రాంతవాసులు కొద్దిపాటి నష్టాలతో ఊపిరి పీల్చుకున్నారన్నారు. ప్రభుత్వం గత కొన్ని రోజులుగా చేపడుతున్న ముందస్తు జాగ్రత్త చర్యలు మూలంగా అధికారులు ప్రజాప్రతినిధులు సమన్వయంతో చేసిన కృషి మూలంగా చాలావరకు నష్టాలను అరికట్టగలిగారన్నారు. భారీ వర్షాలతో లోతట్టు ప్రాంతాల ప్రజానీకం ముంపు మూలంగా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొనాల్సి వచ్చిందన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర వ్యవసాయ ఉద్యాన సహకార మార్కెటింగ్ డైరీ డెవలప్మెంట్ మత్స్యశాఖల మంత్రి కే. అచ్చెన్న నాయుడు, స్థానిక పార్లమెంట్ సభ్యులు జి. హరీష్ మాధుర్, శాసనసభ్యులు ఏ. ఆనందరావు, దాట్ల సుబ్బరాజు, ప్రత్యేక అధికారి విజయరామరాజు, జిల్లా కలెక్టర్ ఆర్. మహేష్ కుమార్, జాయింట్ కలెక్టర్ నిశాంతి, డిఆర్ఓ కే. మాధవి తదితరులు పాల్గొన్నారు.

# శభాష్ కలెక్టర్...సెల్యూట్ ఎస్పీ

**ఉమ్మడి గోదావరి జిల్లాల సూర్య బ్యూరో :**





మొంథా తుఫాన్ నేపథ్యంలో ప్రజలకు సహాయం అందించడానికి జిల్లా కలెక్టర్ షాన్మోహన్, ఎస్పీ బిందు మాధవ్ల నేతృత్వంలో రాష్ట్ర అధికార యంత్రాంగం ఆదేశాలతోజిల్లా యాంత్రాంగం వివిధ సేవలు చేపట్టి... సముద్ర తీరప్రాంతాలు, లోతట్టు ప్రాంతాల్లో ఉన్నవారిని పునరావాసకేంద్రాలకు సురక్షితంగా తరలించారు. అదేవిధంగాహెూప్ఐలాండ్లో నివసిస్తున్న 110 మందిని ఒప్పించి వారిని రప్పించిపునరావాస కేంద్రంలో షెల్టర్ కల్పించారు. గర్భిణులు,బాలింతలు, వృద్ధులు, రోగులను సురక్షిత ప్రాంతాలకు తరలించి, వారికి అక్కడ వైద్యం అందించేలా చర్యలు తీసుకున్నారు. ఎన్డీఆర్ఎఫ్, ఎస్డీఆర్ఎఫ్, అగ్నిమాపక సిబ్బందిని రంగంలోకి దింపారు. తుఫాన్ బాధితుల కోసం ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాలలో ఆహారం, మంచినీరు,పాలు,రొట్టి,మందులువంటి సౌకర్యాలు పూర్తిస్థాయి లో కల్పించారు. జిల్లా ప్రత్యేక అధికారి కృష్ణతేజతో కలసి అన్ని ప్రాంతాల్లో పర్యటించి...పరిస్థితులు అవగాహన చేసుకొని అవసరమైన సహాయక చర్యలు నిమిషాల వ్యవధిలో చేపట్టారు.. సహాయక చర్యల పర్యవేక్షణ కోసం కంట్రోల్ రూమ్లు, హెల్ప్లైన్నెంబర్లనుఏర్పాటు చేశారు. తుఫాను తర్వాత విద్యుత్,రోడ్డు, మున్సిపల్, పంచాయితీరాజ్ శాఖలఅధికారులు విద్యుత్సరఫరా,రహదారులు,ఇతరమౌలికవసతులను పునరుద్ధరించడానికి కృషి చేశారు.

**ప్రతి జీవితం ఎంతో విలువైనది..** జిల్లా యంత్రాంగానికి ప్రతి జీవితం ఎంతో విలువైనదనే సంకేతం అందించి...మొంథాతుఫాన్ను విజయ వంతంగా ఎదుర్కోవడానికి అద్భుతకృషిసెల్పారుజిల్లాకలెక్టర్ షాన్మోహన్, ఎస్పీ బిందుమాధవ్లు. తుఫాన్విధుల్లోఅలసత్వం ప్రదర్శిం చిన అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేసినా...వారిలో మార్పుతేగలిగి.. వారితో సేవ చేయించే చాకచక్యం కలెక్టర్ షాన్మోహన్ సొంతం..ఆయనకు ఆయనే సాటి..

**సేవలు చేసిన సిబ్బంది చిరకాలం గుర్తుండిపోతారు..**మొంథా తుఫాన్ నేపథ్యంలో ఎప్పటికప్పుడు ప్రాణాలు సైతం లెక్కచేయకుండా జిల్లా అధికార యంత్రాంగం ఆదేశాలను నిర్వర్తించడం కోసం పెనుగాలులు, భారీ వర్షాన్ని సైతం లెక్కచేయకుండా ప్రాణాలు పణంగా పెట్టి ప్రజల కోసం పోలీసులు, రెవెన్యూ ఉద్యోగులు చేసిన సాహసం అమోఘం అభినందనీయం... ఈ సహాయక విధుల్లో ఉన్న ప్రతి ఉద్యోగి 24 గంటలు రాత్రి పగలు తేడా లేకుండా వాళ్ళ పాత్ర వారు పోషిస్తూ ప్రజలకు చెరువలో ఉంటూ పునరావాస కేంద్రాల్లో బాధితులకు అన్ని సౌకర్యాలు అందించిన ప్రతి ఒక్క చిరు ఉద్యోగి నుంచిపై అదికారి వరకు పేరుపేరునా చేసిన సేవలు చిరస్మరణీయం...

**ఎప్పటికప్పుడు అంచనా వేస్తూ...** మొంథా తుఫాన్ కాకినాడ వద్ద తీరం దాటుతుందని వాతావరణశాఖ హెచ్చరించడంతో ప్రజలు తీవ్రంగా భయపడ్డారు. కాని తన కర్తవ్యాన్ని గుర్తుచేసుకుని, జిల్లా యంత్రాంగానికి దిశా నిర్దేశం అందించి ...అంచెలంచెలుగా పూర్తిగా మొంథా తుఫాన్ పై ఆధిపత్యం సాధించారు.. ఎప్పటికప్పుడు తుఫాన్ గమనంపై అంచనాతో కలెక్టర్ షాన్మోహన్...కలెక్టరేట్లో పలుశాఖలఅధికారులతో సమావేశాలు నిర్వహించారు. తుఫాన్ ప్రభావిత ప్రాంతాల్లో తీసుకోవాల్సిన చర్యలపై పూర్తిస్థాయిలోసమీక్షించారు. పోలీసులు,రెవిన్యూ,విద్యుత్,ఫైర్, ఎన్డీఆర్ ఎఫ్, వైద్యం తదితరశాఖల సిబ్బందిని సమన్వయం చేసి...సన్నద్ధం చేయడంలో కలెక్టర్ షాన్మోహన్ విజయం సాధించారు. అందుకే ప్రజలు శభాష్కలెక్టర్షాన్మోహన్అనివెయ్యినోళ్ళ పొగడ్తలతో ముంచెత్తుతున్నారు..

**కలెక్టర్, ఎస్పీ సహాయక చర్యలు..**జిల్లావ్యాప్తంగా మొంథా తుఫాన్ ప్రభావంతో విస్తారంగావర్షాలు కురిశాయి. దాదాపు మూడురోజులపాటు వర్షాలు–ఈదరుగాలులు వీచాయి. మొంథా తుఫాన్ కాకినాడ వద్ద తీరం దాటితే పెద్ద విపత్తు వచ్చునేమో... భగవంతుని దయో లేక జిల్లా ప్రజల పుణ్యంతో... తుఫాన్ గమనం మార్చుకోవడంతో పెద్ద ముప్పు నుంచి తప్పించుకోగలిగాం... ఎటువంటి ప్రాణనష్టం జరగకుండా యంత్రాంగం అప్రమత్తంగా వ్యవహరించింది. ఎక్కడా ఎలాంటి దుర్ఘటనలు జరగకుండా కలెక్టర్ షాన్మోహన్, ఎస్పీ బిందు మాధవ్ లు ముందుండి సహాయక చర్యలను పర్యవేక్షించారు. ప్రత్యేక అధికారి కృష్ణతేజను సమన్వయం చేసుకుంటూ జిల్లాలో విస్తృతంగా పర్యటించారు. ఎప్పటికప్పుడు అధికారులను, ప్రజాప్రతినిధులను అప్రమత్తం చేస్తూ మొంథా తుఫాన్ ను విజయవంతంగా ఎదుర్కొన్నారు. ఫలితంగా జిల్లాలో మొంథా తుఫాన్ వల్ల ప్రాణ, ఆస్తి, పంట నష్టాలు సంభవించలేదు. ఈ సేవలకు గుర్తింపుగా ప్రజలు ప్రశంసలు కురిపిస్తూనే వున్నారు. శభాష్ కలెక్టర్.. సెల్యూట్ ఎస్పీ అంటూనే వున్నారు.

## సిఎం చంద్రబాబు ఏరియల్ విజిట్

మొదటిపేజి తరువాయి

ఆయన హెలికాప్టర్లో నుంచి పరిశీలించారు. తుఫాను వల్ల ఎక్కువగా నష్టపోయిన జిల్లాలతోపాటు డాక్టర్ బి. ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లాను ఆయన ఏరియల్ వ్యూలో పరిశీలించారు. ఏరియల్ సర్వే అనంతరం కోనసీమ జిల్లాలోని అల్లవరం మండలం ఓడలరేవులో రోడ్డుమార్గంలో పర్యటించారు. అక్కడనీట మునిగిన పంటపొలాలను పరిశీలించి, స్థానిక ప్రజలతో మాట్లాడి వారికి అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. తుఫాను సహాయక, పునరావాస చర్యలపై అధికారులతో సమీక్షించారు. బాధితులకు తక్షణ సహాయం అందించాలని ఆదేశించారు.

## తుఫాన్ బాధితులకు అండగా వాడపల్లి వెంకన్న ఆలయం

– అన్నదాన పథకానికి విరాళం





**ఆత్రేయపురం, మేజర్ న్యూస్ :** మండలంలోని వివిధ గ్రామాల్లో ఏర్పాటు చేసిన తుఫాన్ పునరావాస కేంద్రాల్లో ఉన్న వారికి జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు వాడపల్లి వెంకటేశ్వర స్వామివారి ఆలయం నుండి ఉచితముగా ఈ నెల 27వ తేదీ నుండి మధ్యాహ్నం, రాత్రి భోజనాలను ఆలయ అన్నదాన కేంద్రం నుంచి అందజేస్తున్నారు. పునరావాస కేంద్రాల్లో ఉంటున్న వారందరికీ భోజనాలు అందేలా చర్యలు తీసుకుంటున్నట్లు ఆలయ డిప్యూటీ కమిషనర్ నల్లం సూర్యచక్రధర్ రావు తెలిపారు. తుఫాను కారణంగా ఆలయం వద్ద పెండమ్స్ వంటివి కొద్దిగా దెబ్బతిన్నాయి. భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా తీసుకుంటున్నట్లు తెలిపారు. నిత్య అన్నదాన పథకానికి విజయవాడకు చెందిన చి. చిట్టూరి లిఖిత్ ఆదిత్య, చిట్టూరి రియాన్ష్ సాయి వారి కుటుంబ సభ్యులు రూ. 50,116లు విరాళంగా అందించారు. వీరికి ఆలయ అర్చకులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి స్వామి చరిత్ర గురించి వివరించారు. దాతలకు ఆలయ డిప్యూటీ కమిషనర్ నల్లం సూర్య చక్రధర్ రావు, సిబ్బంది స్వామివారి చిత్రపటం అందించారు.

## తుఫాన్ సమాచారం రాగానే కోటమీ ప్రభుత్వం క్షణాల్లో స్పందించింది

– ఎంపీ ఉదయ్ శ్రీనివాస్



**యు. కొత్తపల్లి, మేజర్ న్యూస్ :** 'మొంథా' తుఫాన్ హెచ్చరికలు జారీ అయిన వెంటనే కూటమి ప్రభుత్వం వేగంగా స్పందించిందని ఎంపి ఉదయ్ శ్రీనివాస్ పేర్కొన్నారు. తుఫాను ప్రభావిత ప్రాంతాల్లో ముందస్తు చర్యలు చేపట్టడంతో పాటు, ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించేందుకు అధికార యంత్రాంగం తీవ్రంగా శ్రమించిందన్నారు. తుఫాను ప్రభావిత ప్రాంతాల్లో ప్రభుత్వం పునరావస కేంద్రాలను ఏర్పాటు చేసి అన్ని సౌకర్యాలు కల్పించిందన్నారు. తుఫాన్ ప్రభావం ఎక్కువగా ఉన్న యు. కొత్తపల్లి మండలంలో స్థానిక అధికారులు, 'పడా' సిబ్బంది సమన్వయంతో పనిచేయడంతో ఎక్కడా ఎటువంటి సమస్యలు తలెత్తలేదని తెలిపారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఎప్పటికప్పుడు పరిస్థితి సమీక్షించి సంబంధిత అధికారులకు దిశా నిర్దేశం చేశారన్నారు. ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఆదేశాలతో జనసైనికులు, వీర మహిళలు సహాయక చర్యల్లో పాల్గొని ప్రభుత్వానికి సహకరించారన్నారు. తుఫాను ప్రభావం పూర్తిగా తగ్గిన తర్వాత, ఎక్కడెక్కడ నష్టం వాటిల్లిందో అంచనా వేసి ప్రభుత్వానికి నివేదిస్తారని తెలిపారు. తుఫాన్ నేపథ్యంలో గత నాలుగు రోజులుగా ప్రజలకు కచ్చితమైన సమాచారం అందిస్తూ మీడియా చేసిన కృషిని అభినందించారు.

# మొంథా తుఫాను వలన దెబ్బతిన్న పొలాలను పరిశీలించిన ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి

**– పంట నష్టపోయిన రైతులను కూటమి ప్రభుత్వం ఆదుకొంటుంది**
**– ఎమ్మెల్యే నల్లమిల్లి**



**అనపర్తి, మేజర్ న్యూస్ :** "మొంథా" తుఫాను వలన కురిసిన భారీ వర్షాలకు దెబ్బతిన్న పొలాలను బుధవారం అనపర్తి ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా అనపర్తి ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ మొంథా తుఫాన్ కారణంగా రైతాంగం తీవ్రంగా నష్టపోయిందని, ప్రభుత్వం ముందస్తు చర్యలు చేపట్టిన కారణంగా అధికార యంత్రాంగం సన్నద్ధం అవ్వడం కారణంగా ప్రాణ, ఆస్తి నష్టం జరగకుండా కాపాడగలిగామని, ఈ తుఫాన్ కారణంగా వరి రైతులు తీవ్రంగా నష్టపోయారని, మరోపక్క మినుము రైతులు కూడా తీవ్రంగా నష్టపోయారని అన్నారు.

ఇవాళ వరి పంట కూడా ఇంకొక 15 రోజుల్లో కోతలు ప్రారంభమయ్యే నేపథ్యంలో ఈరోజు ప్రకృతి వైపరీత్యం రావడం వల్ల మొత్తం పంట అంతా నేలకు ఒరిగిం దని, నేలకు ఒరగడమే కాకుండా మొలకలు రావడం ప్రారంభమ య్యాయి అని అన్నారు. ఈ పరిస్థితిలో రైతాంగం దీనిని ఏ విధంగానూ అమ్ముకోలేని పరిస్థితి వస్తుందని , తప్పనిసరిగా ప్రభుత్వం పూర్తిస్థాయిలో ఆదుకోవాల్సిన పరిస్థితి ఉందని, ముఖ్యంగా ఏదైతే ప్రభుత్వ నిబంధనలు ప్రకృతి విపత్తులకు సంబంధించిన నిబంధనలలో పడిపోయిన పంట చేలకు నష్ట పరిహారం కన్న నీట మునిగిన పంట చేలకు మాత్రమే నష్టపరిహారం ఇవ్వాలని నిబంధనలను ఉన్నప్పటికీ ముఖ్యమంత్రి పెద్ద మనసు చేసుకుని రైతాంగానికి సహకారం అందించాలని కోరుతున్నామని అన్నారు. ఇవాళ ఇంత తీవ్రమైన తుఫాను ఎటువంటి ఆస్తి నష్టం ప్రాణం నష్టం జరగకుండా ముందుకి వెళ్ళాము అంటే అది ముఖ్యమంత్రి ముందు చూపేనని,అధికార యంత్రాంగాన్ని సంపూర్ణంగా సన్నద్ధం చేసి కూటమి నాయకులందరినీ సన్నద్గం చేసి అందరూ క్షేత్రస్థా యిలో ఉండటం వల్ల ఇబ్బందికరమైన పరిస్థితి నుంచి సురక్షితంగా బయటపడ్డామని, అయినప్పటికీ ప్రకృతి వైపరీత్యం వల్ల నష్టపోయిన రైతాంగాన్ని ఆదుకోవాల్సిన అవసరం ఉందని అన్నారు. రైతులకు సంపూర్ణ న్యాయం జరగడం కోసం క్షేత్రస్థాయిలో ఉన్న పరిస్థితులు సంపూర్ణంగా ప్రభుత్వానికి నివేదించి, రైతులకు న్యాయం జరిగే విధంగా చర్యలు తీసుకుంటామని అన్నారు. ఈ కార్యక్రమంలో అధికారులు, అనపర్తి మండలం కూటమి నాయకులు, మహేంద్రవాడ గ్రామ కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# నేడు మున్సిపల్ కౌన్సిల్ సాధారణ సమావేశం



**పెద్దాపురం, మేజర్ న్యూస్ :** ఈ నెల 30వ తేదిన గురువారం ఉదయం 11 గంటలకు, మున్సిపల్ కౌన్సిల్ హాలు నందు కౌన్సిల్ సాధారణ సమావేశం మున్సిపల్ ఛైర్‌పర్సన్ బొడ్డు తులసి మంగతాయారు అధ్యక్షతన నిర్వహించబడునని, కమీషనర్ కె.శ్రీకాంత్‌రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన తెలుపుతూ ఈ సమావేశంలో మున్సిపల్ కౌన్సిల్ సభ్యులు, కోఆప్షన్ మెంబర్లు పాల్గొననున్నారని, కమీషనర్ తెలిపారు. కావున పురపాలక సంఘ వివిధ శాఖల విభాగాధిపతులు విధిగా హాజరు కావాలని, కమీషనర్ తెలిపారు.

# పునరావస కేంద్రాలను పరిశీలించిన తహశీల్దార్ వెంకటలక్ష్మీ



**పెద్దాపురం రూరల్, మేజర్ న్యూస్ :** పెద్దాపురం మండలంలో మొంథా తుఫాన్ నేపధ్యంలో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఏర్పాటు చేసిన పునరావస కేంద్రాలను తహశీల్దార్ సిహెచ్.వెంకటలక్ష్మీ, ఎస్సై వి.మౌనికతో కలసి పరిశీలించారు. దీనిలో భాగంగా కట్టమూరు, కాండ్రకోట గ్రామాలలో ఏర్పాటు చేసిన పునరావస కేంద్రాలను పరిశీలిస్తూ అక్కడ తలదాచుకుంటున్న కుటుంబాలకు అందుతున్న సేవలు, ఆహారం వంటి వాటిపై వివరాలు అడిగి మెరుగైన ఆహారం త్వరితగతిన అందించేలా సిబ్బందికి పలు సూచనలు చేశారు. అనంతరం కట్టమూరు గ్రామంలో ఏలేరు ప్రధాన కాలువ ద్వారా ప్రవహిస్తున్న వరద ఉధృతిని వారు పరిశీలించడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఇరిగేషన్ ఏఇ నిమ్మకాయల శ్రీనివాస్ కుమార్ పాల్గొన్నారు.

# నష్టపోయిన రైతులను ప్రభుత్వమే ఆదుకోవాలి - మాజీ మంత్రి వేణు



– తుఫాన్ కారణంగా దెబ్బతిన్న వరి పొలాలను పరిశీలించిన మాజీ మంత్రి వేణు, మాజీ ఎమ్మెల్యే సత్తి

**అనపర్తి, మేజర్ న్యూస్ :** 'మొంథా' తుఫాను వల్ల రైతులు తీవ్రంగా నష్టపోయారని, నష్టపోయిన ప్రతి రైతును ఆదుకోవలసిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని మాజీ మంత్రి చల్లబోయిన శ్రీనివాస్ వేణుగోపాలకృష్ణ అన్నారు. బుధవారం అనపర్తి నియోజకవర్గంలోని పలు ప్రాంతాల్లో తుఫాన్ వల్ల దెబ్బతిన్న వరి పొలాలను అనపర్తి మాజీ ఎమ్మెల్యే సత్తి సూర్యనారాయణ రెడ్డితో కలిసి పరిశీలించారు. నష్టం వివరాల గురించి రైతులని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి వేణు, మాజీ ఎమ్మెల్యే సత్తి సూర్యనారాయణ రెడ్డి మాట్లా డుతూ తుఫాన్ కారణంగా వరిచేలు నేలమట్టం అయ్యాయని, చేతికి అందిన పంట, నేలపాలు అయిందని రైతు సోదరులు భారీ నష్టాన్ని చవిచూశారని అన్నారు. ముఖ్యంగా కౌలు రైతులు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారని అన్నారు. గత వైయస్ఆర్‌సీపీ ప్రభుత్వ హయాంలో అప్పటి ముఖ్యమంత్రి వైయస్ జగన్ మోహన్ రెడ్డి నాయకత్వంలో 'రైతు భరోసా' కార్యక్రమం ద్వారా ప్రభుత్వం పంట నష్టాన్ని భరిస్తూ, ఇన్సూరెన్స్ రిజిస్ట్రేషన్ (క్రాప్ బుకింగ్)ను సక్రమంగా నిర్వహించి, రైతులను ఆదుకునే వారని, పంటల నష్టం కారణంగా అప్పుల ఊబిలో పడిన రైతులు కూడా ఉన్నారని అన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి, రైతులందరికీ జరిగిన నష్టానికి తగిన పరిహారం అందించేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. రైతులకు భరోసా కల్పించడం, ఇన్సూరెన్స్ సాయం సమర్థవంతంగా అందించడం తక్షణ అవసరమని అన్నారు. రైతుల కష్టాలను తగ్గించేందుకు, ఆర్థిక నష్టాన్ని నియంత్రించేందుకు ప్రభుత్వం ప్రాథమిక చర్యలు చేపట్టాలని అన్నారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు సబ్బెళ్ళ కృష్ణారెడ్డి సత్తి హరిప్రసాద్ రెడ్డి, పోతుల వరప్రసాద్ రెడ్డి బొడ్డు ముత్యాలరావు, తదితర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# మొంథా తుఫాన్ బాధితులకు భరోసా కల్పించిన

**వైసిపి నాయకులు పరిమి శ్రీను**





**పెద్దాపురం రూరల్, మేజర్‌న్యూస్ :** మొంథా తుఫాన్ నేపధ్యంలో పెద్దాపురం మండలం ఆర్.బి.పట్నం గ్రామంలో వైయస్సార్ సిపి పార్టీ నాయకులు పరిమి శ్రీను కాలనీలో నివసిస్తున్న నిరుపేద కుటుంబాలను కలసి మనొధైర్యంతో పాటు భరోసా కల్పించడం జరిగింది. దీనిలో భాగంగా తుఫాన్ కారణంగా తీవ్ర ఇబ్బందులు పడుతున్న కుటుంబాలకు ఉదయం టిఫిన్లు, మధ్యాహ్నం భోజనాలు సుమారు 100 మందికి అందజేయడం జరిగింది.

## పెద్దాపురం డివిజన్‌లో వర్షపాతం వివరాలు

**పెద్దాపురం,మేజర్‌న్యూస్ :** పెద్దాపురం డివిజన్‌లోని11 మండలాలలో బుధవారం ఉదయం 8.30 నుండి సాయంత్రం 5.00 గంట వరకు నమోదైన వర్షపాతాల వివరాలు. కోటనందూరు మండలం 6.0 మి.మీ., తుని 3.6 మి.మీ., రౌతులపూడి 2.4 మి.మీ., శంఖవరం 1.8 మి.మీ., ఏలేశ్వరం 2.4 మి.మీ., జగ్గంపేట 1.2 మి.మీ., కిర్లంపూడి 0.0 మి.మీ., ప్రత్తిపాడు 3.6 మి.మీ., తొండంగి 1.2 మి.మీ., పెద్దాపురం 0.4 మి.మీ., గండేపల్లి2.2 మి.మీ., వర్షపాతం నమోదైనట్లు ఆర్డీఓ కార్యాలయం ఒక ప్రకటనలో తెలిపింది.

సూర్య
www.suryaa.com
మీరు చందాదారులుగా చేరాలనుకుంటున్నారా..
సకాలంలో పేపరు అందడం లేదా...
సంప్రదించండి సెల్ : 9989800678
అతి తక్కువ ఖర్చుతో పుట్టినరోజు, వివాహ వేడుక, పదవీ విరమణ, ప్రారంభోత్సవం, శ్రద్ధాంజలి, పేరు మార్పు, లీగల్ ప్రకటనలకు, మీ కార్యక్రమాలకు సంబంధించిన వార్తలు ఏవైనా సరే
సంప్రదించండి. సెల్ : 9032209779

# తుఫాను బాధితులకు అండగా ఉంటాం : మంత్రి కందుల దుర్గేష్

**– ముక్కామలలో తుఫాన్ దాటికి దెబ్బతిన్న అరటి తోటలను పరిశీలించిన మంత్రి దుర్గేష్**

**– యుద్ధ ప్రాతిపదికన విద్యుత్ పునరుద్ధరించిన పెరవలి మండలం విద్యుత్ సిబ్బందిని అభినందించిన మంత్రి దుర్గేష్**



**పెరవలి,మేజర్‌న్యూస్ :** ముక్కామల గ్రామంలో అక్టోబర్ 29వ తేదీ బుధవారం ఆంధ్రప్రదేశ్ పర్యాటక సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కందుల దుర్గేష్ పర్యటించి దెబ్బతిన్న పంట పొలాలు, అరటి తోటలను పరిశీలించి ఎన్యుమరేషన్ జాగ్రత్తగా చేయాలని అధికారులకు సూచించారు.మొంథా తుఫాన్ ధాటికి దెబ్బతిన్న ఇళ్లను, నేలకొరిగిన చెట్లను, స్తంభాలను పరిశీలించి అధికారులకు పలు సూచనలు జారీ చేశారు.తుఫాన్ ప్రభావం తగ్గేవరకు అధికారులంతా ప్రజలకు అందుబాటులో ఉండాలని సూచించారు.తుఫాన్ బాధితులకు అండగా ఉంటామని మంత్రి కందుల దుర్గేష్ రైతాంగానికి భరోసానిచ్చారు. పంట నష్టాలకు సంబంధించిన వివరాలను అడిగి తెలుసుకున్నారు. ప్రజలు, రైతాంగం అధైర్యపడవద్దని, కూటమి ప్రభుత్వం అండగా ఉంటుందని భరోసానిచ్చారు. ఈ సందర్భంగా మొంథా తుఫాన్ ధాటికి దెబ్బతిన్న ఇళ్లను, నేలకొరిగిన చెట్లను, స్తంభాలను పరిశీలించి అధికారులకు పలు సూచనలు జారీ చేశారు. తుఫాన్ ప్రభావం తగ్గేవరకు అధికారులంతా ప్రజలకు అందుబాటులో ఉండాలని సూచించారు.పెరవలి మండలం లోని ముక్కామల గ్రామంలో తుఫాన్ గాలికి పడిపోయిన అరటి తోటలను స్వయంగా వెళ్లి మంత్రి దుర్గేష్ పరిశీలించారు. అక్కడి రైతాంగంతో మాట్లాడి పరిస్థితిని తెలుసుకున్నారు. గ్రామాల్లో అరటి తోటలు బాగా దెబ్బతిన్నాయని ఉద్యానరైతులు మంత్రి దుర్గేష్ దృష్టికి సమస్యను తీసుకువచ్చారు. ఈ సందర్భంగా ఎన్యుమరేషన్ జాగ్రత్తగా చేపట్టాలని అధికారులకు సూచించారు. రైతాంగాన్ని ఆదుకుంటామని భరోసానిచ్చారు.నిడదవోలు నియోజకవర్గ వ్యాప్తంగా రోడ్లపై చెట్లు పడిపోవడం, స్తంభాలు నేలకొరగడం వంటి సమస్యలను తక్షణమే పరిష్కరించామని మంత్రి దుర్గేష్ అన్నారు. కాలువలు, చెరువులు గండిపడకుండా నిత్యం పర్యవేక్షించామన్నారు. ఎక్కడైనా విద్యుత్‌కు అంతరాయం కలిగితే సంబంధిత అధికారులతో మాట్లాడి యుద్ధ ప్రాతిపదికన పునరుద్ధరణ చర్యలు చేపట్టామన్నారు. ఈ సందర్భంగా మొంథా తుఫాన్ ఆపత్కాలంలో అధికార యంత్రాంగం పనితీరును మంత్రి కందుల దుర్గేష్ ప్రశంసించారు. అధికార యంత్రాంగాన్ని సంసిద్ధులను చేసి ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ విలువైన సలహాలు, సూచనలు అందిస్తూ ప్రకృతి విపత్తులను, తుఫాన్ లను ఎదుర్కోవడంలో సమర్థుడిగా సీఎం చంద్రబాబునాయుడుకు గొప్ప పేరుందన్నారు. హుద్ హుద్ తుఫాన్ మాదిరి మొంథా తుఫాన్ నేపథ్యంలో సైతం మంత్రులు, కలెక్టర్లు, ఎస్పీలు, ఇతర అధికార యంత్రాంగంతో టెలీకాన్ఫరెన్స్ నిర్వహించి సమాయత్తులను చేసిన విషయాన్ని మంత్రి దుర్గేష్ గుర్తుచేశారు. ఈ కార్యక్రమంలో పెరవలి తహసిల్దార్ కే నిరంజన్ ఎంపీడీవో కేయూఆర్ఎల్ పద్మజ జనసేన మండల పార్టీ అధ్యక్షుడు పెప్పర రవికుమార్, తెదేపా మండల పార్టీ అధ్యక్షుడు అధికాల కృష్ణమ్మ, నీటి సంఘం అధ్యక్షులు నల్ల సురేంద్ర, జనసేన ముక్కామల గ్రామ అధ్యక్షుడు రేలంగి రాజేష్, జనసేన నాయకులు చిట్టిడి త్రిమూర్తులు, కూనప రెడ్డి సుబ్బారావు, గండేపల్లి ముసలయ్య, మారిశెట్టి దుర్గారావు, కనికనిడి ప్రసాద్, కొత్తపల్లి సత్యనారాయణ, ముక్కామల సొసైటీ అధ్యక్షులు వేంద్ర వెంకట రామమూర్తి, ఇతర కూటమి నాయకులు పాల్గొన్నారు.

# వరి పంట నష్టపోయిన గ్రామాలు పరిశీలన



**సామర్లకోట, మేజర్ న్యూస్ :** వరి పంట నష్టపోయిన గ్రామాలకి మండల వ్యవసాయ అధికారి వంగపండు మురళిధర్ గురువారం పరిశీలించడం జరిగింది. పిబిదేవం, వేట్లపాలెం జిమెడపాడు నవర ఉండూరు గ్రామాల్లో పర్యటించడం జరిగింది. అక్కడికి రైతులకి పడిపోయిన వరి పంటలో తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించడం జరిగింది ఈ కార్యక్రమంలో జి. మేడపాడు సొసైటీ అధ్యక్షులు రవిబాబు ఏఈవోలు రూప కమల విఏలు నాగేశ్వరరావు భవిత వెంకన్న నాయుడు శ్రీనివాస్ రైతులు పాల్గొన్నారు.ఇంతవరకు 17 గ్రామాల్లో ప్రాథమికంగా నష్టపోయిన వరి పంట 6204 ఎక రాలు గుర్తించడం జరిగింది.

# ఫ్యాక్టరీలు వ్యర్థం జలాలు గ్రామీణ ప్రాంతాల మురికితో గోదావరి జలాలు కలుషితం



**సామర్లకోట,మేజర్‌న్యూస్ :** కాకినాడ కార్పొరేషన్‌తో పాటు రెండు ప్రధాన మున్సిపాలిటీలు అయిన సామర్లకోట పెద్దాపురం మున్సిపాలిటీల ప్రజలకు త్రాగునీరు అందించే గోదావరి జలాలు పూర్తి కలుషితంగా మారాయి..గత 4 రోజుల నుండి గోదావరి కాలువలో ప్రవహిస్తున్న నీరు నల్లటి రంగులో మారడమే కాకుండా తీవ్ర దుర్గంధం సైతం వెదజల్లుతుంది.. పలు ఫ్యాక్టరీల నుండి విడుదల అయ్యే వ్యర్థ జలాల ను గోదావరి కాలువలోకి నేరుగా వదలడం వల్లే గోదావరి జలాలు కలుషితం అవుతున్నాయని పలువురు రైతులు ఆందోళన చెందుతున్నారు.. మరియు గోదారి కాలు వెంబడి ఉన్న గ్రామాల నుంచి ప్రతిరోజు వస్తున్న మురుగునీరు కూడా గోదారు కాలువలోకి వదులుతున్నారు దీనిని అరికట్టాల్సిన పొల్యూషన్ కంట్రోల్ బోర్డు అధికారులు నామ మాత్రంగా తనిఖీలు నిర్వహించి చేతులు దులుపుకుంటున్నారు.. దీనిపై భీమేశ్వర ఆలయ ట్రస్ట్ బోర్డు చైర్మన్ మరియు రైతు సంఘ నాయకులు కంటే జగదీష్ మోహన్ మాట్లాడుతూ గత కొన్ని రోజులుగా గోదావరి కాలువ నుండి నల్లటి రంగులో నీరు రావడంతో పాటు దుర్గంధం వెదజల్లుతున్నాయని అన్నారు.ఈ నీటిని పంట పొలాలకు వాడితే పంట నాశనంఅయ్యే ప్రమాదం ఉందని పేర్కొన్నారు. .ముఖ్యంగా ఈ జలాలను తాగునీటికి వినియోగిస్తున్నారని దీని వల్ల ప్రజలు రోగాల భారిన పడే ప్రమాదం ఉందని అన్నారు..అంటే కాకుండా కార్తీక మాస మహా పర్వదినాలు పురస్కరించుకుని రాష్ట్ర నలుమూలల నుండి వచ్చే భక్తులు సైతం గోదావరి కాలువలోస్నానాలుఆచరించి స్వామి వారిని దర్శించుకుంటారని అయితే ప్రస్తుతం గోదావరి కాలువలో స్నానాలు ఆచరిస్తే రోగాల భారిన పడే ప్రమాదం ఉందని అన్నారు..దీనిపై సంబంధిత అధికారులు స్పందించి గోదావరి కాలువలో కాలుష్య జలాలు కలవకుండా తగు చర్యలు తీసుకోవాలని జగదీష్ మోహన్ కోరారు.

# వరి, పత్తి పంటలను పరిశీలించిన మండల స్పెషల్ ఆఫీసర్ అంబేద్కర్



**రాజవొమ్మంగి, మేజర్ న్యూస్ :** మండలంలోని కింద్ర గ్రామంలో పత్తి పంటలను రాజవమ్మంగి మండల ప్రత్యేక అధికారి అంబేద్కర్ పరిశీలించి, రైతులతో మాట్లాడడం జరిగింది. అనంతరం మండలం లో వరి మరియు పత్తి పంటలు పరిశీలించారు., ఈసందర్భంగా మండల వ్యవసాయ అధికారి చక్రదర్ రైతులకు పలు చూచనలు చేశారు.ఈ వాతావరణంలో వరి పంటలో పాము పోడ తెగులు( మాగుడు తెగులు) పెరగడానికి అవకాశం ఎక్కువుగా ఉంది, మాగుడు తెగులు నివరించడానికి ఎకరా పొలంకు 400ఎంల్ హెక్సాకోనజోల్ మందునుగాని, 400 ఎంల్ వాలిడమైసిన్ మందును గాని 200 లీటర్ల నీటిలో కలిపి స్ప్రే చేసుకోవాలి. అలాగే ఆకు ముడత పురుగు అదికంగా పెరగడానికి అవకాశం ఎక్కువగా ఉంది, నివారణ కై ఎకరా పోలంకి 400 గ్రాములు కార్టాప్ హైడ్రోక్లోరైడ్ లేదా 60 మి.లీ క్లోరాంట్రానిలిప్రోల్ మంధును 200 లీటర్లు నీటిలో కలిపి పిచికారి చేసుకోవాలని రైతులకు సూచించారు.

# కూలడానికి సిద్ధంగా భవనాలు కూల్చివేత



**సామర్లకోట, మేజర్ న్యూస్ :** తుఫాన్ కారణంగా సామర్లకోట పట్టణంలో పలు ప్రాంతాల్లో కూలడానికి సిద్ధంగా ఉన్న భవనాలను మున్సిపల్ అధికారులు కూల్చివేశారు. స్టేషన్ సెంటర్ గడియార స్తంభం వద్ద గల పురాతన భవనాన్ని మంగళవారం సాయంత్రం అధికారులు కూల్చివేశారు. అలాగే బల్లమార్కెట్ సెంటర్‌లో శిథిలావస్థకు చేరుకున్న మున్సిపల్ షాపింగ్ కాంప్లెక్స్ భవనాన్ని అధికారులు కూల్చివేశారు. ప్రాణ నష్టం జరగకుండా ముందస్తు జాగ్రత్త చర్యలలో భాగంగా వీటిని కూల్చివేయడం జరిగిందని మున్సిపల్ కమీషనర్ శ్రీ విద్య పేర్కొన్నారు.

# మండలంలో పంట నష్టాన్ని అంచనా వేసిన వ్యవసాయ అధికారులు





**గండేపల్లి,మేజర్‌న్యూస్ :** తుఫాన్ ప్రభావంతో మండలంలో నష్టపోయిన పంట నష్టాన్ని బుధవారం స్థానిక వ్యవసాయ అధికారులు పంటనష్టాన్ని అంచనా వేశారు.

ఈ సందర్భంగా వ్యవసాయ అధికారిని లక్ష్మి తెలిపిన వివరాల ప్రకారం గండేపల్లి మండలంలో వరి 7520 ఎకరాలు కాగా తుఫానుకు ముందు 3200 ఎకరాలు కోతలు పూర్తయ్యాయని తుఫాను ప్రభావంతో పంట నష్టపోయింది 375 ఎకరాలు వరి నేలకు ఒరిగిందన్నారు. మినుము మండలంలో ఒక ఉయ్యాల 37 ఎకరాలు సాగు చేయగా తుఫానుకు ముందు 450 ఎకరాలు కోతలు పూర్తయి అని తెలిపారు. తుఫాను ప్రభావంతో 421 ఎకరాలు మినప్పంట నష్టపోయిందన్నారు. మొక్కజొన్న 72 ఎకరాల కాగా పట్ట నష్టం 56 ఎకరాలుగా గుర్తించామన్నారు. ఈ పంట నష్టం అంచనాని ఉన్నతాధికారులకు నివేదిస్తామని ఆమె తెలిపారు. ఈమె వెంట ఏ ఈ ఓ తదితరులు ఉన్నారు.

# పిఠాపురం మున్సిపల్ కార్యాలయానికి "వాస్తు" దోషం

**- వాస్తు పేరుతో కార్యాలయ తలుపులు మూసి వేస్తున్న మున్సిపల్ మేనేజర్**
**- మేనేజర్ పై చర్యలు తీసుకోవాలని కౌన్సిల్ సభ్యుల డిమాండ్**



**పిఠాపురం, మేజర్ న్యూస్ :** పిఠాపురం మున్సిపల్ కార్యాలయానికి మున్సిపల్ మేనేజర్ రూపంలో వాస్తు దోషం పట్టుకుందని, వాస్తు దోషమంటూ కార్యాలయం తలుపులు మూసివేస్తున్న మరియు సచివాలయ ఉద్యోగులపై వేధింపులకు పాల్పడుతున్న కౌన్సిల్ మున్సిపల్ మేనేజర్ పై చర్యలు తీసుకోవాలని కౌన్సిల్ సభ్యులు డిమాండ్ చేశారు. బుధవారం పిఠాపురం మున్సిపల్ కౌన్సిల్ కార్యాలయంలో చైర్పర్సన్ గండేపల్లి సూర్యావతి బాబి అధ్యక్షతన జరిగిన కౌన్సిల్ సమావేశం జరిగింది. పట్టణంలో పడకేసిన పారిశుధ్యం పై కౌన్సిల్ సభ్యులు ఆగ్రహం వ్యక్తం చేశారు. కౌన్సిల్ సభ్యులు అల్లవరపు నగేష్ మాట్లాడుతూ... శానిటేషన్ అధ్వానంగా తయారయిందని, పట్టణమంతా మురికి కూపంగా తయారై పుర ప్రజలకు, పర్యాటకులకు దర్శనమిస్తుందన్నారు. కౌన్సిలర్ బోనాసుల శివ మాట్లాడుతూ... డ్రైవర్స్ కాలనీ సమీపంలో ఆక్రమణలు అధికంగా ఉండడం వల్ల వర్షపు నీరు రోడ్డుపై నిలిచి రహదారులపై ప్రయాణికులకు ఇబ్బంది కలుగుతుందని, వెంటనే ఆక్రమణలు తొలగించాలని ఇంచార్జ్ కమిషనర్ రాజును కోరారు. కౌన్సిల్ సభ్యురాలు బొజ్జా జగదీశ్వరి మాట్లాడుతూ...

మున్సి పల్ కార్యాలయంలో వాస్తు పేరుతో కార్యాలయాన్ని తలుపులు వేస్తున్న మున్సిపల్ మేనేజర్ కడియం దుర్గా హరి మోహన్ పై చర్యలు తీసుకోవాలని, ప్రజా ప్రతినిధులు, పౌరులు ఎవరైనా కార్యాలయానికి వస్తే వారు రావడానికి వీల్లేదని మేనేజర్ చెప్పడం పలువురికి ఇబ్బంది కలుగుతుందని, కార్యాలయానికి తలుపులు వేయడం సరికాదన్నారు.

కో ఆప్షన్ సభ్యులు గండేపల్లి రామారావు(బాబి) మాట్లాడుతూ... సచివాలయ మహిళా ఉద్యోగులను మున్సిపల్ మేనేజర్ వేధిస్తున్నారని, ఉదయం 6 గంటల నుండి విధులు నిర్వహించి లొకేషన్ షేర్ చేసి పనులు చేయాలని మహిళలను సైతం వేధిస్తున్నట్లు ఆరోపించారు. మహిళలను కించపరుస్తూ... సచివాలయ ఉద్యోగులను అగౌరపరుస్తూ వారిని వేధిస్తున్నట్లు ఆరోపించారు. డబల్ అసెస్మెంట్లు పై మేనేజర్ హరి మోహన్ సమయం వృధా చేసి తాత్సారం చేయడంపై కౌన్సిలర్ అల్లవరపు నగేష్ మండిపడ్డారు. మహిళా ఉద్యోగులను వేధిస్తున్న మేన ేజర్ పై తక్షణం చర్యలు తీసుకోవాలని, కమిషనర్ను డిమాండ్ చేశారు. కౌన్సిలర్ బోను దేవా మాట్లాడుతూ... సురవరపు దివాణం అనే కాంట్రాక్టర్ ను కౌన్సిల్ సభ్యులంతా బ్లాక్ లిస్టులో పెడితే... అతనికి పనులు ఎలా అప్పగిస్తున్నారని, ఎవరికీ కానీ బిల్లులు అతనికి ఎలా చెల్లిస్తున్నారని అధికారులను ప్రశ్నించారు. ఆమోదించిన అభివృద్ధి పనులు టెండర్లు పిలిచి త్వరితగతన పనులు పూర్తి చేయాలని, గతంలో పనిచేసిన వర్కుల కాంట్రాక్టర్ల బిల్లులు చెల్లించాలని కోరారు. 226 పనులకు 76 లక్షలు బిల్లులు ఎందుకు చెల్లించడం లేదని, కో ఆప్షన్ సభ్యులు అధికారులు నిలదీయగా దీనిపై అకౌంటెంట్ పద్మజ్యోతి మాట్లాడుతూ... ప్రభుత్వం ఓబి 1పద్దుల కింద రూ. 6 కోట్లు, ఓబి 2 పద్దుల కింద రూ. 10 కోట్లు జనరల్ ఫండ్ ప్రభుత్వం బ్లాక్ చేసినట్లు వెల్లడించారు. అలానే గతంలో చేసిన అభివృద్ధి పనులు బిల్లులు సి ఎఫ్ ఎం ఎస్ చేసినప్పటికీ ప్రభుత్వం వాటిని రద్దుచేసి మళ్ళీ అప్లోడ్ చేయమన్నట్లు వివరించారు. ఇది కాకుండా రెవెన్యూ ఆదాయాన్ని బట్టి అభివృద్ధి పనులుకు నిధులు ఖర్చు చేయాలని ప్రభుత్వం సూచించిందన్నారు.

దీనిపై తలిశెట్టి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ... మన డబ్బులు గవర్నమెంట్ వాడుకుని, చేసిన పనులకు బిల్లులు ఎవరు చెల్లిస్తారని నిలదీశారు. మన నిధులు ప్రభుత్వం లాక్ చేయడం సరికాదన్నారు. పేదలపై అధిక పన్నుల భారం వేయడం సమంజసం కాదన్నారు. అల్లవరపు నగేష్ మాట్లాడుతూ... చిన్నమాంబ పార్కు చుట్టూ ఆక్రమణలు అధికమయ్యాయని, ప్రైవేటు వ్యక్తులు ఆక్రమణ చేసి వ్యాపారస్తుల నుండి రోజువారీ రూ. 500 వసూలు చేస్తున్నట్లు కమిషనర్ కు ఫిర్యాదు చేశారు. సమావేశంలో వివిధ శాఖల అధికారులు కౌన్సిల్ సభ్యులు పాల్గొన్నారు.

# వరదలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

**- ఎమ్మెల్యే, రాష్ట్ర ఎస్టీ సంక్షేమ కమిటీ చైర్ పర్సన్ మిరియాల శిరీష దేవి సుడిగాలి పర్యటన**



**రాజవొమ్మంగి, మేజర్ న్యూస్ :** మొంథా తుఫాన్ కారణంగా ప్రజలు చాలా అప్రమత్తం గా ఉండాలని రంపచోడవరం ఎమ్మెల్యే,రాష్ట్ర ఎస్టీ సంక్షేమ కమిటీ చైర్ పర్సన్ మిరియాల శిరీషదేవి అన్నారు. నియోజకవర్గంలోని గంగవరం, అడ్డతీగల, రాజవొమ్మంగి మండలాల్లో బుధవారం ఆమె సుడిగాలి పర్యటన చేశారు. తొలుత గంగవరం మండలంలోని కురుమగొంది లో కన్నేరు వాగును పరిశీలించి ప్రజలకు పలు సూచనలు చేశారు. అనంతరం పనుకురాతిపాలెం పెద్దేరు వాగు, రాజవొమ్మంగి అప్పలరాజు పేట ప్రాజెక్ట్ ను పరిశీలించి రైతులకు, ప్రజలకు పలు సూచనలు చేసి జాగ్రత్తగా ఉండాలన్నారు. ఎలాంటి నష్టం జరగకుండా ప్రభుత్వ అధికారులు చెపుతున్న జాగ్రత్తలు పాటించాలని సూచించారు. ఎలాంటి నష్టం జరిగినా నేరుగా తనకు తెలియజేయాలన్నారు. నష్టం పరిహారం జరిగినా నష్ట పరిహారం అందేలా చర్యలు చెప్పడతానన్నారు. అలాగే ప్రస్తుత పరిస్థితిలో వాగులు దాటకుండా ఉండాలని సూచించారు. ఆయా ప్రదేశాల్లో పోలీసులు పటిష్టంగా బందోబస్తు ఏర్పాటు చేయాలని కోరారు. ప్రజలకు ఎలాంటి అవసరం ఉన్నా సంభ%శీ%ధిత అధికారులు చర్యలు చేపట్టాలని కోరారు. అలాగే రైతులెవ్వరూ అధైర్య పడవద్దు అని ఆందోళన చెందవద్దని మీకు ఎలాంటి ఇబ్బంది ఉన్నా నేను మీకు అండగా ఉంటానని భరోసా కల్పించారు. అలాగే త్వరలో రైతులు పండించిన ప్రతీ ధాన్యపు గింజను ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని హామీ ఇచ్చారు. వేటమామిడిలో మొంథా తుఫాన్ వలన విరిగి పడిన స్తంబాలు, చెట్లు ప్రదేశాన్ని పరిశీలించి త్వరితగతిన పునరుద్ధరణ చేయాలని కోరారు. అలాగే తుఫాన్ వల్ల దెబ్బతిన్న విద్యుత్ సరఫరాను పునరుద్ధరించేందుకు విద్యుత్ శాఖ బృందాలుగా పనిచేస్తున్నారని తెలిపారు. సీఎం చంద్రబాబు నాయుడు దూర దృష్టితో, అపార అనుభవంతో అధికారులను, కూటమి పార్టీ నాయకులను, ప్రజలను అప్రమత్తం చేసి తుఫాన్ వల్ల అధిక నష్టం జరగకుండా చూశారని తెలిపారు. అలాగే మన నియోజకవర్గంలో ముఖ్యంగా ప్రాణనష్టం జరగకుండా కాపాడగలిగామని ఆయనకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

రాజవొమ్మంగి లో ఇటీవల అనారోగ్యంతో వైద్యం చేయించుకున్న చల్లా వీరభద్రరావుకి రూ:1,36,438/-లు ముఖ్య మంత్రి సహాయనిధి చెక్కు అందజేశారు. కార్యక్రమంలో ఆమె వెంట ఏఎంసీ చైర్మన్ లోతా లక్ష్మణరావు, రాష్ట్ర ఇండస్ట్రీయల్ మరియు ఇన్ఫ్రాస్ట్రక్చర్ డైరెక్టర్ గొల్లపూడి పెద్దిరాజు, మాజీ మండలంపార్టీ అధ్యక్షులు గణజాల తాతారావు, దూసరపాము ఎంపీటీసీ నల్లా స్థానిక సత్తిబాబు, సొసైటీ అధ్యక్షులు పాము అర్జున్, మండలం పార్టీ అధ్యక్షులు పల్లాల వెంకటరెడ్డి, రాష్ట్ర రైతు విభాగం నాయకులు కనిగిరి రాంబాబు, గొర్లె సాగర్, బాలయోగి, బీజేపీ రాష్ట్ర కార్యదర్శి స్వప్న కుమారి, బొదిరెడ్డి త్రిమూర్తులు, కింతాడ నానిబాబు, స్థానిక తహసీల్దార్ అల్లు సత్యనారాయణ, ఎంపీడీఓ లోకుల యాదగిరీశ్వర రావు తదితరులు పాల్గొన్నారు.

# ఎర్రకాలువ వరద ప్రవాహాన్ని పరిశీలించిన కలెక్టర్ కీర్తి చేకూరి



**రాజమహేంద్రవరం, మేజర్ న్యూస్ :** మొంథా తుఫాను ప్రభావం నేపథ్యంలో నల్లజర్ల మండలంలోని అనంతపల్లి గ్రామం వద్ద ఎర్ర కాలువ వరద నీటి ప్రవాహాన్ని జిల్లా కలెక్టర్ కీర్తి చేకూరి బుధవారం ప్రత్యక్షంగా పరిశీలించారు. కలెక్టర్ వెంట కొవ్వూరు ఆర్డీవో రాణి సుస్మిత, తహసీల్దార్ నల్లజర్ల, ఇరిగేషన్ శాఖ డీఈఈ మరియు ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు. ఎర్ర కాలువలో నీటి మట్టం పెరుగుదల, ముంపు ప్రభావిత ప్రాంతాలు, జంగారెడ్డిగూడెం వద్ద జరుగుతున్న ప్రాజెక్టు నిర్మాణ స్థితి వంటి అంశాలపై కలెక్టర్ కీర్తి చేకూరి క్షేత్ర స్థాయిలో సమీక్ష నిర్వహించారు. కలెక్టర్ కీర్తి చేకూరి మాట్లాడుతూ, "ఖమ్మం జిల్లా, భద్రాది కొత్తగూడెం జిల్లాల నుంచి ఎర్ర కాలువకు వరద నీరు వస్తోందనీ, ఎగువ ప్రాంతాల నుంచి ఎంత వరద నీరు వస్తే ఇక్కడ ముంపు ప్రభావం ఉంటుందో ఇరిగేషన్ అధికారులతో సమీక్షించారు. కాలువ మొత్తం 4 టీఎంసీ సామర్థ్యం కలిగి ఉండగా, ప్రస్తుతం 2.5 టీఎంసీ నీరు ఉందని అధికారులు పేర్కొన్నారు." రూట్ మ్యాప్ ఆధారంగా వరద నీటి ప్రవాహ దిశ, ముంపు ప్రమాద ప్రాంతాలను ఇంజినీరింగ్ బృందంతో సమీక్షించిన కలెక్టర్ అవసరమైన నియంత్రణ చర్యలు తీసుకోవాలని సూచించారు. తదుపరి, కలెక్టర్ రైతులతో ముఖాముఖి మాట్లాడి వారి సమస్యలను తెలుసు కున్నారు. నల్లజర్ల మండల పరిధిలో 1,235 హెక్టార్లలో వరి సాగు జరగగా, మొంథా తుఫాను ప్రభావంతో 110 హెక్టార్ల పంట పడిపోయి, నష్టం వాటిల్లిందన్నారు. ఇప్పటి వరకు సేకరించిన డేటా ప్రకారం మండలంలోని 12 గ్రామాలకు చెందిన 83 మంది రైతులకు ఈమేరకు నష్టం జరిగిందన్న అంచనాలకి వొచ్చినట్లు అధికారుల నుంచి ప్రత్యక్షంగా తెలుసుకున్నారు. పంట పొలాల్లో నీరు నిల్వ ఉండకుండా పిల్లకాల్వలు ఏర్పరచి, నీరు బయటకు వెళ్లేలా చర్యలు తీసుకోవాలని రైతులకు కలెక్టర్ సూచించారు. వ్యవసాయ అధికారులు సూచనలు మేరకు పూర్తిగా పడిపోయిన కంకులను కట్టలుగా నిలబెట్టి, ధాన్యాన్ని రక్షించుకోవడం, మొలక రాకుండా ఉండటానికి 5% ఉప్పు ద్రావణాన్ని పిచికారి చేయడం వంటి చర్యలు తీసుకోవాలని సూచించారు. కలెక్టర్ కీర్తి చేకూరి మాట్లాడుతూ, "ప్రజల భద్రత మరియు రైతుల పంట రక్షణ రాష్ట్ర ప్రభుత్వ ప్రాధాన్యత. తుఫాను ప్రభావిత ప్రాంతాల్లో రైతుల నష్టాలను అంచనా వేసి, తక్షణ సాయం అందించే చర్యలు చేపడతాం అన్నారు. ప్రభుత్వం ప్రజలతో పాటు నిలబడి, ప్రతి కుటుంబానికి అవసరమైన సహాయం అందిస్తు ందన్నారు. అధికారులు శాఖల మధ్య సమన్వయంతో పని చేసి ఎవరూ ఆందోళన చెందకుండా చూడాలనీ పేర్కొన్నారు.

## తుపాను వల్ల దెబ్బతిన్న రైతులను అన్ని విధాల ఆదుకుంటాం

**- తుఫాన్ ప్రభావిత పంట పొలాల పరిశీలించిన ఎమ్మెల్యే బండారు సత్యానందరావు**



**ఆత్రేయపురం, మేజర్ న్యూస్ :** తుఫాన్ కారణంగా పంటలు దెబ్బతిన్న రైతులను ఆదుకునేందుకు ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటుందని కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు తెలిపారు. బుధవారం ఆర్డీవో శ్రీకర్తో కలిసి మండలంలోని కట్టుంగ, నార్కేడిమిల్లి, వసంతవాడ, పులిదిండి, వద్దుపర్రు, వెలిచేరు గ్రామాలలో తుఫాన్ వల్ల జరిగిన పంట నష్టాన్ని స్వయంగా పరిశీలించి, రైతులతో మాట్లాడి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ముందుచూపుతో ప్రాణ నష్టం జరగకుండా చర్యలు తీసుకున్నారని, అయితే పంట నష్టం మాత్రం విస్తారంగా జరిగిందని, దీనికి ప్రభుత్వం ఇప్పటికే పరిహారాన్ని ప్రకటించింది అన్నారు. వరి పంటకు ఎకరాకు 8 వేలు, అరటి పంటకు ఎకరాకు 14 వేలు, కూరగాయల పంటలకు ఎకరాకు 10 వేలు ప్రభుత్వం ఈ నష్టపరిహారం త్వరితగతిన అందించేలా చర్యలు తీసుకుంటుందని ఎమ్మెల్యే తెలిపారు. ఈ కార్యక్రమంలో తాసిల్దార్ రాజేశ్వరరావు, రాష్ట్ర తెలుగు రైతు ప్రధాన కార్యదర్శి ఆకుల రామకృష్ణ, మండల టిడిపి అధ్యక్షులు కూసంపూడి రామకృష్ణంరాజు, ముల్లపూడి భాస్కరరావు, మండల ఎన్డీఏ కూటమి నాయకులు, స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

# రామచంద్రపురం నియోజవర్గంలో మంత్రి సుభాష్ సుడిగాలి పర్యటన

- నేలకొరిగిన పంట పొలాలను పరిశీలించిన మంత్రి
- అన్నదాతకు అండగా ఉంటాం
- ప్రతి ధాన్యం గింజను కొనుగోలు చేస్తాం
- పంట నష్టాన్ని సీఎం చంద్రబాబు దృష్టికి తీసుకెళ్తా
- రైతుల పక్షపాతి కూటమి ప్రభుత్వం
- సమగ్ర నివేదిక ఇవ్వాలని అధికారులకు ఆదేశాలు





**రామచంద్రపురం/కాజులూరు, మేజర్ న్యూస్ :** అన్నదాతలను ఆదుకునేందుకు కూటమి ప్రభుత్వం ఎల్లప్పుడూ చిత్తశుద్ధితో ఉందని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ పేర్కొన్నారు. ఇటీవల కురిసిన భారీ వర్షాలు, గాలివానలు, తుఫాన్ కారణంగా రామచంద్రపురం నియోజకవర్గంలోని పలు గ్రామాల్లో నీట మునిగి, నేలమట్టమైన గ్రామాల్లో కూటమి పార్టీ సీనియర్ నాయకులు వాసంశెట్టి సత్యం, రెవెన్యూ, వ్యవసాయ శాఖ అధికారులతో కలిసి విస్తృతంగా పర్యటించారు. నియోజకవర్గంలోని ఓదూరు, చేదువాడ, తర్లంపూడి, శీల గ్రామాల్లో పంట పొలాలను మంత్రి పరిశీలించారు. ఈ సందర్భంగా అక్కడ రైతులతో మాట్లాడి ధైర్యం చెప్పారు. నియోజకవర్గంలో సుమారు 51 వేల 800 ఎకరాల్లో ఖరీఫ్ సాగవుతుందని, భారీ వర్షాలు, తుఫాను తాకిడికి 80 శాతం మేర పంట పొలాలు నేలమట్టం అయ్యాయని అన్నారు. పంట నష్టం వివరాలను ఒక సమగ్ర నివేదిక అందజేయాలని వ్యవసాయ శాఖ అధికారులను ఆదేశించారు. అధైర్య పడవద్దు.. కూటమి ప్రభుత్వం మీకు అన్నివేళలా అండగా ఉంటుందని రైతులకు భరోసా ఇచ్చారు. అనంతరం మీడియా ప్రతినిధులతో మాట్లాడుతూ రామచంద్రపురం, కె.గంగవరం, కాజులూరు మండలాల్లో మొత్తం 51 వేల 800 ఎకరాల్లో ఖరీఫ్ పంటలు సాగులో ఉన్నాయని, అందులో సుమారు 41 వేల ఎకరాల్లో పంటలు నేలమట్టం అయినట్టు గుర్తించామన్నారు. ప్రస్తుతం పంటలు గింజ గట్టిపడే దశ నుండి పాలు నిండే దశలో ఉన్నాయన్నారు. పంటలు చేతికొచ్చే దశలో తుఫాన్, అకాల వర్షాల కారణంగా పంటలు నేలకొరిగి రైతాంగం ఆందోళన చెందుతున్నారని అన్నారు.

వ్యవసాయ శాఖ అధికారులు క్షేత్రస్థాయిలో పంటల పరిశీలనలు చేసి నష్టపోయిన రైతులకు అవసరమైన సహాయక చర్యలు తీసుకోవాలని ఆదేశాలు జారీ చేశామన్నారు. అన్నదాతలు కలత చెందవద్దని, రైతులు నష్టపోకుండా ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటుందని స్పష్టం చేశారు. కూటమి పార్టీ నాయకులు వాసంశెట్టి సత్యం మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం రైతుల పక్షపాతిగా ఉండి అన్నివేళలా ఆదుకుంటుందని, అన్నదాతలు ఆందోళన చెందవద్దని అన్నారు. మంత్రి సుభాష్ పంట నష్టాలను సీఎం దృష్టికి తీసుకెళ్లి తగు న్యాయం జరిగేలా చూస్తారని పేర్కొన్నారు. మంత్రి సుభాష్ వెంట కాజులూరు తహసిల్దార్ ఠాగూర్, వ్యవసాయ శాఖ అధికారి వి.అశోక్, పలువురు అధికారులు, కూటమి పార్టీ నాయకులు తదితరులున్నారు.

# బ్లూ రైన్ ఉచిత వైద్య సహాయం



**కాకినాడ, మేజర్ న్యూస్ :** తుఫాను సహాయక కార్యక్రమాలలో భాగంగా సామాజిక బాధ్యతగా మరియు మానవతా దృక్పథంతో ఉచిత వైద్య సల హాలు మరియుచికిత్స కాకినాడ దంటు వారి వీధిలో ఉన్న బ్లూ రైన్ హాస్పిటల్ అధినేత డాక్టర్ శుభశేఖర్ రెడ్డి ఆధ్వర్యంలో వైద్యుల బృందం అందించ బడతాయని ఆసుపత్రి పరిపాలన విభాగ ప్రతినిధి దుర్గాప్రసాద్ తెలిపారు. అందు బాటులో ఉండే సేవలను డాక్టర్ శుభ శేఖర్ రెడ్డి వివరించారు. ఫస్ట్ ఎయిడ్, టెలీ కన్సల్టేషన్ శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది, అతిసారం (డయేరియా), ప్రిస్క్రిప్షన్ రిఫిల్స్, ఆక్సిజన్, ఎమర్జెన్సీ అంబులెన్స్ సదుపాయం అందుబాటులో ఉంచామని, ప్రజలు 988873 4444 సెల్ నెంబర్‌లో సంప్రదించవచ్చని డా.శుభ శేఖర్ రెడ్డి తెలిపారు. ఈ అంశాన్ని సహాయ పునరావాస కేంద్రాల్లో నివాసముంటున్న ప్రజలకు ఎల్లప్పుడు సేవలు అందుబాటులో ఉంటాయని అన్నారు.

# పెరిగిన ధరలకు అనుగుణంగా జీతాలు పెంచాలి

- జిజిహెచ్ శానిటేషన్ వర్కర్స్ యూనియన్ డిమాండ్
- 31వ తేదీ లోపు వేతన ఒప్పందం చేసుకోవాలి



**కాకినాడ, మేజర్ న్యూస్ :** కాకినాడ ప్రభుత్వ సామాన్య ఆసుపత్రిలో శానిటేషన్ వర్కర్స్‌కు పెరిగిన ధరలకు అనుగుణంగా జీతాలు పెంచాలని డిమాండ్ చేస్తున్నారు. 2025 అక్టోబర్ ఒకటో తేదీ నుంచి జిజిహెచ్ లో శానిటేషన్ నిర్వహణ కాంట్రాక్ట్ క్రిస్టల్ ఇంటిగ్రేటెడ్ సర్వీసెస్ లిమిటెడ్ అనే సంస్థ పొందిన విషయం తెలిసిందే. సెప్టెంబర్ 22వ తేదీనే సిఐటియు ఆధ్వర్యంలో శానిటేషన్ వర్కర్స్ రాబోవు కాంట్రాక్టర్ ప్రతినిధులకు డిమాండ్ నోటీసు ఇవ్వడం జరిగింది. వర్కర్స్ యూనియన్‌తో చర్చించడానికి గడువు కావాలని కాంట్రాక్ట్ సంస్థ వారు రాతపూర్వకంగా కోరారు. రోగులకు ఇబ్బంది కలగరాదని, ఆసుపత్రి పరిపాలనకు ఆటంకం లేకుండా చూడాలని ఉద్దేశంతో జీతం ఎంత ఇస్తారో తేలకపోయినా, విధులు నిర్వహిస్తూ వస్తున్నామని కార్మికులు తెలియజేశారు. ఈ సందర్భంగా సిఐటియు నగర కోకన్వీనర్ వీరబాబు మాట్లాడుతూ సూపరింటెండెంట్ వారికి గతంలో వినతి పత్రం ఇచ్చిన నేపథ్యంలో ఏజెన్సీ వారే కార్మికులతో చర్చించి సమస్య పరిష్కరించుకోవాలని తెలియజేశారన్నారు. ఐదు దఫాలు చర్చలు జరిగినా వేతనాల విషయంలో కాంట్రాక్ట్ సంస్థ ప్రతిపాదనకు, కార్మికులకు అంగీకారం కుదరలేదన్నారు. ఈ నేపథ్యంలో ఆందోళన చేపట్టాలని నిర్ణయించినా వాతావరణ పరిస్థితుల వల్ల, ప్రభుత్వ యంత్రాంగానికి, ఆసుపత్రి నిర్వహణకు ఇబ్బంది కలగరాదని వాయిదా వేశామన్నారు. అందువల్ల డిమాండ్స్ బ్యాడ్జీలు ధరించి కార్మికులు విధులకు హాజరవుతున్నారని తెలిపారు.

బ్యాడ్జీలు ధరించిన సందర్భంగా సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి చెక్కల రాజకుమార్ మాట్లాడుతూ కాంట్రాక్ట్ సంస్థ కార్మికులతో సానుకూలంగా చర్చించి డిమాండ్స్ పరిష్కరించాలని కోరుతున్నామన్నారు. అవసరమైన సందర్భంలో ఆసుపత్రి యాజమాన్యం జోక్యం చేసుకొని కార్మికుల న్యాయమైన డిమాండ్స్ పరిష్కారానికి తోడ్పడాలని విజ్ఞప్తి చేస్తున్నామన్నారు. లేనిపక్షంలో కార్మికులు ఆందోళన చేయడం తప్ప మరో మార్గం లేదన్నారు. జి.జి .హెచ్. శానిటేషన్ వర్కర్స్ ఉద్యమం చేపడితే సిఐటియు అనుబంధ సంఘాలన్నీ అండగా నిలుస్తామని తెలిపారు. బుధవారం మధ్యాహ్నం మరోసారి కాంట్రాక్ట్ సంస్థ ప్రతినిధి బి. గంగరాజుకి నోటీసు సమర్పించారు. సూపరింటెండెంట్ వారికి కూడా రాతపూర్వకంగా అందించారు. ఈ సందర్భంగా యూనియన్ అధ్యక్షుడు సిహెచ్. విజయ్ కుమార్ మాట్లాడుతూ అక్టోబర్ 31వ తేదీ లోపు కార్మిక యూనియన్‌తో కాంట్రాక్టర్ చర్చలు పూర్తిచేసి, రాతపూర్వక ఒప్పందం చేసుకోవాలని కోరుతున్నామన్నారు. లేనిపక్షంలో నవంబర్ 3వ తేదీ ఉదయం నుండి ఎమర్జెన్సీలు మినహాయించి మిగిలిన విభాగాలలో విధులు బహిష్కరించి ఆందోళన తీవ్రతరం చేస్తామని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నగర కన్వీనర్ మలక వెంకటరమణ, జిల్లా కమిటీ సభ్యుడు మేడిశెట్టి వెంకట రమణ లతోపాటు యూనియన్ నాయకులు జె.శేషు, ఆర్.రమేష్, ఎస్.వాసు వివియన్ కుమార్, డి.దుర్గాప్రసాద్, బి.మంగతాయారు, ఎం.కుమారి, బి.రమణమ్మ, ఆర్.తలుపులమ్మ, బి.కృష్ణవేణి, ఎం.రవి, ఎం.ఏసు తదితరులు పాల్గొన్నారు. సెక్యూరిటీ గార్డ్స్ యూనియన్ నాయకులు సోమరాజు, భాగ్యలక్ష్మి లు సంఘీభావం తెలిపారు.

## తుఫాన్ ప్రభావిత ప్రజలకు నిత్యావసరాలు పంపిణీ

- కోస్తా జోన్ ప్రత్యేక అధికారి అజయ్ జైన్



**కాకినాడ రూరల్/ఉప్పాడ, మేజర్ న్యూస్ :** మొంథా తుఫాను ప్రభావిత ప్రజలకు నేటి నుంచి నిత్యావసర సరుకుల పంపిణీ చేయడం జరుగుతుందని కోస్తా జోన్ ప్రత్యేక అధికారి, రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక కార్యదర్శి అజయ్ జైన్ పేర్కొన్నారు. బుధవారం కాకినాడ రూరల్ మండలం సూర్యారావుపేట, నేమం మీదుగా ఉప్పాడ సముద్ర తీర ప్రాంతాన్ని మొంథా తుఫాను కోస్తా జోన్ ప్రత్యేక అధికారి అజయ్ జైన్..జిల్లా కలెక్టర్ షణ్మోహన్‌తో కలిసి పరిశీలించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..తుఫాను బాధితులకు నేటి నుంచే నిత్యావసర సరుకుల పంపిణీ చేయాలని రాష్ట్ర ప్రభుత్వం ఆదేశించిందన్నారు. ఈ నేపథ్యంలో కాకినాడ జిల్లాలో మొంథా తుఫాను ప్రభావిత ప్రాంతాల్లోని ప్రజలకు నిత్యావసరాలను ఉచితంగా పంపిణీ చేసేందుకు అవసరమైన చర్యలు వెంటనే చేపట్టాలని అధికారులను ఆదేశించారు. గౌరవ రాష్ట్ర ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు పునరావాస కేంద్రాల్లో ఉన్న ప్రతి కుటుంబానికి రూ. 3 వేలు చొప్పున ఆర్థిక సహాయం అందజేయాలన్నారు. ప్రతి బాధిత కుటుంబానికి 25 కేజీల బియ్యం (మత్స్యకారులకు 50 కేజీల బియ్యం), కిలో చొప్పున పప్పు, వంట నూనె, ఉల్లిపాయలు, బంగాళాదుంపలు, చక్కెర అందజేయాలని ఆయన తెలిపారు. అదేవిధంగా తుఫాను నష్ట గణన ప్రక్రియ చేపట్టాలన్నారు. తుఫాను అనంతర సహాయక చర్యలపై కూడా అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. మొంథా తుఫాను తీరం దాటినప్పటికీ రెండు రోజులపాటు దాని ప్రభావం ఉంటుందని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తెలిపారు.

# కిమ్స్ హాస్పిటల్‌లో స్ట్రోక్ డే



**అమలాపురం, మేజర్ న్యూస్ :** ప్రపంచ స్ట్రోక్ అవగాహనా దినోత్సవం కిమ్స్ హాస్పిటల్‌లో బుధవారం నిర్వహించారు. మెదడుకి రక్త సరఫరా అకస్మాత్తుగా ఆగిపోవడం లేదా రక్తనాళం పగిలిపోవడం వల్ల కలిగే పరిస్థితినే స్ట్రోక్ లేదా పక్షవాతం అంటారని సకాలంలో గుర్తించి చికిత్స చేస్తే దీని లక్షణాలు తగ్గి, ఆరోగ్యంగా ఉండగలమని, అవగాహన కొరకు ఈ ప్రపంచ స్ట్రోక్ అవగాహనా దినోత్సవం జరుపుకుంటు న్నామని మెడికల్ డైరెక్టర్ డా.హరి కిరణ్ వర్మ అన్నారు. స్ట్రోక్ వచ్చినపుడు ఆలస్యం చేయకుండా వెంటనే హాస్పిటల్ కు తీసుకొని వస్తే తగిన చికిత్స ద్వారా నయం చేయగలమని, ప్రముఖ న్యూరాలజిస్ట్ డా.రామ అభిషేక్ తెలిపారు. అధిక రక్తపోటు, మధుమేహం, అధిక కొవ్వు గల ఆహారం తినడం, వ్యాయామం లేకపోవడం, మానసిక ఒత్తిడి మొదలైన కారణాల వళ్ళ స్ట్రోక్ వచ్చే అవకాశం ఉన్నదని డా.రామ అభిషేక్ తెలిపారు. అకస్మాత్తుగా తలతిరుగుడు లేదా సమతుల్యం కోల్పోవడం, ఒక కన్ను లేదా రెండు కళ్లలో స్పష్టంగా కనిపించకపోవడం, ముఖం ఒక వైపు వంగిపోవడం, చేతి లేదా కాలి బలహీనత, మాట తడబాటు లేదా అర్థంలేని మాటలు వచ్చుట వంటివి స్ట్రోక్ ముఖ్య లక్షణాలని, అటువంటి పరిస్థితులలో వెంటనే న్యూరాలజిస్ట్‌ను సంప్రదించి తగిన వైద్యం పొందినట్లయితే త్వరగా కోలుకొని, ఆరోగ్యవంతులు కాగలరని ఆయన తెలిపారు. ఈ అవగాహనా కార్యక్రమ నిర్వాహకులను కిమ్స్ చైర్మన్ కె.వి.వి.సత్యనారాయణ రాజు, ఎం.డి. శ్రీ రవి కిరణ్ వర్మ, డీన్ డా.ఆనంద్ ఆచార్య మెడికల్ సూపరింటెండెంట్ పి.సుబ్బారావులు అభినందించారు. కిమ్స్‌లో న్యూరోలాజి వైద్యసేవలు స్థానిక ప్రజలందరూ వినియోగించుకొని ఆరోగ్యంగా ఉండాలని కోరారు.

# తుఫాను బాధితులకు... నష్టపరిహారాన్ని వెంటనే చెల్లించాలి





**- ఇల్లు కోల్పోయినవారికి ఇండ్లను నిర్మించి ఇవ్వాలి**
**- ఆర్‌సిపిఐ రాష్ట్ర కార్యదర్శి రంబాల సతీష్ ప్రభుత్వానికి విజ్ఞప్తి**

**కాకినాడ/ఉప్పాడ, మేజర్ న్యూస్ :** ఉప్పాడ కొత్తపట్నం తదితర గ్రామాలను భారత విప్లవ కమ్యూనిస్టు పార్టీ కాకినాడ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో రాష్ట్ర కార్యదర్శి రంబాల సతీష్ తుఫాన్ బాధితులని పరామర్శించారు, ఈ సందర్భంగా మత్స్యకారులతో మాట్లాడుతూ తుఫాన్ కారణంగా ఎదురవుతున్న సమస్యల్ని అడిగి తెలుసుకున్నారు, ఈ నేపథ్యంలో స్థానికులు తమ సమస్యలను వివరించారు. తుఫాన్లు అల్పపీడనాలు ఏర్పడుతున్న ప్రతిసారి ఉప్పాడ కొత్తపట్నం తీర గ్రామాలు కోతకు గురవుతున్నాయని తమ ఇండ్లను కోల్పోతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు ప్రభుత్వం ఇప్పటికైనా దయతలిచి తీరానికి ఆనుకుని ఉన్న కాలనీలకు ప్రత్యామ్నాయంగా మరొక కాలనీలు నిర్మించి తమకు అందించాలని ప్రజలను కోరారు, కొందరికి ఇళ్ల స్థలాలు ఇచ్చినప్పటికీ ఇండ్లను కట్టుకునే స్థోమత తమకు లేదని తెలిపారు. అలాగే తీరాన్ని పెంచాలని శాశ్వత గోడను నిర్మించి ఉప్పాడ గ్రామాన్ని పరిరక్షించాలని కోరారు. ప్రభుత్వం ఎన్ని నష్టపరిహారాలు ప్రకటించిన తమకు పూర్తిస్థాయిలో అందడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. తుఫాన్ షెల్టర్లలో ఆడవాళ్లకు ప్రత్యేక టాయిలెట్లు లేకపోవడం, తగిన ఇతర ఏర్పాట్లు లేకపోవడంతో అనేక ఇబ్బందులు పడ్డారని తెలిపారు. ఈ సందర్భంగా రాష్ట్ర కార్యదర్శి రంబాల సతీష్ మాట్లాడుతూ మత్స్యకారులు శాశ్వత పరిష్కారం కోసం పోరాడాలని పిలుపునిచ్చారు. భారత విప్లవ కమ్యూనిస్టు పార్టీ ఆర్‌సిపిఐ అండగా ఉంటుందని ప్రత్యేక కాలనీలు ఏర్పాటు చేసి ఇల్లు నిర్మించి ఇచ్చేవరకు మద్దతుగా నిలుస్తుందని తెలిపారు. తుఫాన్ బాధితులకు పూర్తిస్థాయిలో నష్టపరిహారం అందించే వరకు తమ వంతు కృషి చేస్తామని తెలిపారు. ఆర్‌సిపిఐ పార్టీ తరపున బాధితులను ఆదుకునేందుకు ప్రయత్నిస్తామని తెలిపారు. ఈ పర్యటనలో కాకినాడ జిల్లా కమిటీ సభ్యులు, బి.సూరిబాబు, రామదాసు శ్రీనివాసు, కాల రమణ, ప్రసాద్, ఏసుబాబు తదితరులు పాల్గొన్నారు.

# కొంతంగి కొత్తూరు రోడ్డులో రెండు బైకులు ఢీ

**- తృటిలో తప్పిన ప్రమాదం**
**- రోడ్డుకు ఇరువైపులా తుప్పలు పెరిగిపోవడమే ప్రమాదాలకు కారణం**
**- ఆర్ అండ్ బి అధికారులు చర్యలు చేపట్టాలి**
**: జనసేన నాయకులు గొర్లి నాగేశ్వరరావు**



**శంఖవరం, మేజర్ న్యూస్ :** మండలంలోని శాంతి ఆశ్రమం అడ్డు రోడ్డు నుండి కొంతంగి కొత్తూరు గ్రామం వరకు రోడ్డుకు ఇరువైపులా తప్పు రోడ్డుకు ఇరువైపులా తుప్పలు పేరుకుపోవడంతో పేరుకుపోవడంతో మళ్లింపుడు వద్ద తరచుగా ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. బుధవారం మధ్యాహ్నం కొంతంగి కొత్తూరు గ్రామానికి చెందిన అప్పన రాంబాబు కత్తిపూడి నుండి కొంతంగి కొత్తూరు వైపు వెళ్తుండగా కొత్తూరు నుండి కత్తిపూడి వెళ్తున్న గరగపండు మళ్లింపు వద్ద తుప్పలు బాగా పేరుకుపోవడంతో రెండు బైకులు ఢీ కొట్టుకుని ఛిద్రమయ్యాయి. అదృష్టవశాస్తూ ఎవరికీ ఎటువంటి ప్రమాదం చోటు చేసుకోలేదు. సంఘటన జరిగిన వెంటనే జనసేన నాయకులు రైల్వే డివిజనల్ బోర్డ్ కమిటీ మెంబర్ గొర్లి నాగేశ్వరరావు సంఘటన స్థలానికి చేరుకుని తన సొంత ఖర్చులతో బైక్ రిపేర్ చేయిస్తానని హామీ ఇచ్చి, సమస్య పరిష్కార దిశగా ప్రయత్నిస్తానని హామీ ఇచ్చారు. ప్రతిరోజు ఇదే మార్గం నుండి అనేకమంది ప్రయాణికులు ప్రయాణిస్తూ ఉండడం వలన తరచుగా ప్రమాదాలు చోటు చేసుకుంటున్నయని, దీనిపై ఆర్ అండ్ బి అధికారులు వెంటనే చొరవ చూపి సమస్యను పరిష్కరించవలసిందిగా గ్రామస్తులు కోరుతున్నారు.

# రంపచోడవరం, పోలవరం నియోజకవర్గాలను కలుపుతూ కారం తమ్మన్న దొర పేరుతో ప్రత్యేక ఏజెన్సీ జిల్లాగా ప్రకటించాలి

**- చింతూరు సబ్ డివిజన్‌ను నియోజకవర్గంగా ప్రకటించాలి.**
**- రంపచోడవరం, చింతూరు సబ్ డివిజన్లను తూర్పుగోదావరి జిల్లాలో కలిపే నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలి**
**- ఆదివాసీ జేఏసీ రాష్ట్ర కార్యదర్శి కుంజా అనిల్**



**చింతూరు,మేజర్‌న్యూస్ :** రంపచోడవరం, పోలవరం నియోజకవ ర్గాలను,అలాగే చింతూరు సబ్ డివిజన్ ను నియోజకవర్గంగా ప్రకటించి మూడు నియోజకవర్గాలతో రంపచోడవరం కేంద్రంగా ఆదివాసి స్వాతంత్ర సమరయోధుడు కారం తమన్న దొర పేరుతో జిల్లా ప్రకటించాలని ఆదివాసీ జేఏసీ రాష్ట్ర కార్యదర్శి కుంజా అనిల్ ప్రభుత్వాన్ని కోరారు. ఈ సందర్భంగా కుంజా అనిల్ మాట్లాడుతూ రంపచోడవరం, చింతూరు అల్లూరి సీతారామరాజు జిల్లా పాడేరు కేంద్రంగా ఉన్నందున దూరభారాలతో ఈ నియోజకవర్గాలను కొత్త జిల్లాగా ప్రకటిస్తామని ప్రభుత్వం తీసుకున్న నిర్ణయానికి హర్షం వ్యక్తం చేస్తూ ఇదే క్రమంలో ఈ రెండు సబ్ డివిజన్లను చిన్న జిల్లా అవుతుందని, అందుకు ఇది ప్రత్యేక జిల్లా చేయడానికి వీలు కాదనే కారణంగా తూర్పుగోదావరి జిల్లాలో కలిపే ఉద్దేశంతో అధికారులు ఉన్నారని ఆ రకంగా మంత్రివర్గ ఉపసంఘం నిర్ణయం తీసుకుందని, ఈ నిర్ణయాన్ని ప్రభుత్వం ముందు ఉంచారని కొన్ని పత్రిక మాధ్యమాల్లో వచ్చిందని, వెంటనే నిర్ణయాన్ని వెనక్కి తీసుకొని పోలవరం నియోజకవర్గాన్ని ఈ రెండు రెవెన్యూ డివిజన్లను కలిపి మూడు నియోజకవర్గాలతో ఆదివాసి స్వాతంత్ర సమరయోధుడు కారం తమన్న దొర పేరుతో కొత్త జిల్లా ప్రకటించాలని ప్రభుత్వాన్ని, ప్రభుత్వ సలహాదారులను, అధికారులను ఈ సందర్భంగా కోరారు.

# దుష్ప్రచారాలు నమ్మొద్దు

**- మత్స్యకార నాయకుడు విజయకుమార్**



**యు.కొత్తపల్లి, మేజర్ న్యూస్ :** గడిచిన మూడు రోజుల నుంచి తుఫాన్ విషయంలో పవన్ కళ్యాణ్ ఆశీస్సులు మేరకు కాకినాడ పార్లమెంట్ సభ్యులు శ్రీనివాస్ ఆదేశాల మేరకు సురక్షితమైన ప్రాంతాలకు మేము తీసుకువెళ్లడం జరిగిందనీ, పార్లమెంట్ సభ్యులు ఉదయ్ శ్రీనివాస్ ఢిల్లీ నుంచి వచ్చి రోజుకి మూడు పూటల ఉప్పడా లోన్నే నివసించేవారని అంతేకాకుండా అర్ధరాత్రి సమయంలో కూడా మాతో పాటు కలిసి మెలిసి ఉన్నారని అటువంటి వ్యక్తిపై కొందరు కావాలని దుష్ట ప్రచారం చేస్తున్నారని అటువంటివి నమ్మొద్దని మత్స్యకార నాయకుడు జీవీకే అన్నారు. గతంలో ఎన్నో తుఫానులు వచ్చాయని, అప్పుడు నాయకులు ఏమయ్యారని నిలదీశారు. ఎవరు ఎంతలా కావాలని కూటమి ప్రభుత్వంపై బురద జల్లినా అటువంటివారి మాటలు ప్రజలు నమ్మే స్థితిలో లేరన్నారు.

గతంలో ఎంతమంది ఎంపీలు ఉన్నా ఉదయ్ శ్రీనివాస్‌కి సాటిరారన్నారు. గతంలో ఉన్నవాళ్ళు ఫోటో స్టిల్‌కొచ్చి వెళ్లేవారని కానీ నేడు ఎంపీ ఉదయ్ శ్రీనివాస్ మాత్రం ప్రతిఒక్కరి ఇంట్లో ఒక కొడుకులా అందరి జాగ్రత్తలు చూసుకున్నారని అందుకు ఆయనకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలుపుతున్నామంటూ జీవీకే అన్నారు. తుఫాన్ సమయంలో మా వెంట ఉండి నడిపిన ఎమ్మెల్యే మరియు డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్‌కి, ఎంపీ ఉదయ్ శ్రీనివాస్‌కి, రెవిన్యూ డిపార్ట్మెంట్, పోలీస్ సిబ్బంది, వ్యవసాయ శాఖ, పంచాయతీ శాఖ, ఎలక్ట్రికల్ డిపార్ట్మెంట్ వారికి మా మత్స్యకారులందరి తరపున ప్రత్యేక ధన్యవాదాలు తెలుపుతున్నామన్నారు.

## మొంథా తుఫాన్ ప్రాంతాన్ని పరిశీలించిన సీఎం చంద్రబాబు నాయుడు



**అల్లవరం, మేజర్ న్యూస్ :** మొంథా తుఫాన్ ప్రాంతాలను సీఎం చంద్రబాబు నాయుడు పరిశీలించారు. తుఫాన్ సెంటర్లో పునరావాస కేంద్రాలు, అంగన్వాడి షెల్టర్లు, వరి సాగు పంటలను పరిశీలించడంతో ప్రజలు త్రాగునీరు సమస్య, రోడ్ల సమస్య పరిష్కరించాలని తెలిపారు. అలాగే రైతులు సాగునీరు పూర్తిస్థాయిలో అందక పంట పొలాల్లోకి ఉప్పునీరు వస్తుందని తీర ప్రాంతాల్లో భద్రత కల్పించాలని సీఎం దృష్టికి తీసుకువచ్చారు. సీఎం మాట్లాడుతూ సముద్ర కోతకు గురైన భూములను ఎంక్వయిరీ చేయిస్తానని, సముద్ర తీరాన్ని అభివృద్ధి చేస్తానని, పంట చేలోకి ఉప్పునీరు రాకుండా చర్యలు తీసుకుంటామని, రోడ్లు త్రాగునీరు సమస్యలు పరిష్కరిస్తామని తెలిపారు.

## తుఫాను కారణంగా పంటలు నష్టపోయిన రైతులను ప్రభుత్వమే ఆదుకోవాలి

**- వరి, అరటి పంటలను పరిశీలించిన జిల్లా అధ్యక్షులు చిర్ల జగ్గిరెడ్డి**



**ఆత్రేయపురం, మేజర్ న్యూస్ :** తుపాను కారణంగా నష్టపోయిన రైతులను ప్రభుత్వమే ఆదుకోవాలని కోనసీమ జిల్లా వైఎస్ఆర్సిపి అధ్యక్షులు చిర్ల జగ్గిరెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని ఉచ్చిలి గ్రామంలో మొంథా తుఫాన్ కారణంగా నేలకొరిగిన వరి, అరటి పంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉచ్చిలి గ్రామంలో 4 ఎకరాలకు సుమారు 2 ఎకరాల అరటి చెట్లు విరిగి నేలకొరిగిన పరిస్థితి నెలకొందని, మండలం మీద సుమారు 50 శాతం వరకు వంటలు దెబ్బతిన్నాయని, నష్టపోయిన రైతులను వెంటనే ప్రభుత్వం ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ఆయన వెంట మండల పార్టీ కన్వీనర్ కనుమూరి శ్రీనివాసరాజు, కర్రీ నాగిరెడ్డి, గాదిరాజు రామకృష్ణంరాజు, ఉర్రింకల త్రిమూర్తులు, శ్రీనివాస్, ముదునూరి కృష్ణంరాజు, నంబూరి పద్మరాజు తదితరులు ఉన్నారు.

# భారీ వర్షాలకు ప్రజలు అప్రమత్తంగా ఉండాలి





**– రాష్ట్ర ఎస్టీ సంక్షేమ కమిటీ చైర్ పర్సన్ శిరీష దేవి**

**రంపచోడవరం, మేజర్ న్యూస్ :** మొంథా తుఫాన్ కారణంగా కురుస్తున్న భారీ వర్షాలు దృశ్య ప్రజలు అప్రమత్తంగా ఉండాలని రంపచోడవరం ఎమ్మెల్యే రాష్ట్ర ఎస్టీ సంక్షేమ కమిటీ చైర్ పర్సన్ మిరియాల శిరీషదేవి అన్నారు. రంపచోడవరం నియోజకవర్గం పరిధిలోని గంగవరం, అడ్డతీగల, రాజవొమ్మంగి మండలాల్లో బుధవారం ఆమె సుడిగాలి పర్యటన చేశారు. మొంథా తుఫాన్ కారణంగా విస్తృత పర్యటన చేసి పొలాలను, వాగులను ఎమ్మెల్యే, రాష్ట్ర ఎస్టీ సంక్షేమ కమిటీ చైర్ పర్సన్ మిరియాల శిరీష పరిశీలించారు. తొలుత గంగవరం మండలంలోని కురుమగొందిలో కన్నేరు వాగును పరిశీలించి ప్రజలకు పలు సూచనలు చేశారు. అనంతరం పనుకురాతిపాలెం పెద్దేరు వాగు, రాజవొమ్మంగి అప్పలరాజుపేట ప్రాజెక్ట్‌ను పరిశీలించి రైతులకు, ప్రజలకు పలు సూచనలు చేసి జాగ్రత్తగా ఉండాలన్నారు. ఎలాంటి నష్టం జరగకుండా ప్రభుత్వ అధికారులు చెపుతున్న జాగ్రత్తలు పాటించాలని సూచించారు. ఎలాంటి నష్టం జరిగినా నేరుగా తనకు తెలియజేయాలన్నారు. నష్టం జరిగినా నష్టపరిహారం అందేలా చర్యలు చెప్పడతానన్నారు. అలాగే ప్రస్తుత పరిస్థితిలో వాగులు దాటకుండా ఉండాలని సూచించారు. ఆయా ప్రదేశాల్లో పోలీసులు పటిష్టంగా బందోబస్తు ఏర్పాటు చేయాలని కోరారు. ప్రజలకు ఎలాంటి అవసరం ఉన్నా సంబంధిత అధికారులు చర్యలు చేపట్టాలని కోరారు. అలాగే రైతులెవ్వరూ అధైర్య పడవద్దు అని ఆందోళన చెందవద్దని మీకు ఎలాంటి ఇబ్బంది ఉన్నా నేను మీకు అండగా ఉంటానని భరోసా కల్పించారు. అలాగే త్వరలో రైతులు పండించిన ప్రతీ ధాన్యపు గింజను ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని హామీ ఇచ్చారు. వేటమామిడిలో మొంథా తుఫాన్ వలన విరిగి పడిన స్తంబాలు, చెట్లు ప్రదేశాన్ని పరిశీలించి త్వరితగతిన పునరుద్ధరణ చేయాలని కోరారు. అలాగే తుఫాన్ వల్ల దెబ్బతిన్న విద్యుత్ సరఫరాను పునరుద్ధరి ంచేందుకు విద్యుత్ శాఖ బృందాలుగా పనిచేస్తు న్నారని తెలిపారు. సీఎం చంద్రబాబు నాయుడు దూరదృష్టితో, అపార అనుభవంతో అధికారులను, కూటమి పార్టీ నాయకులను, ప్రజలను అప్రమత్తం చేసి తుఫాన్ వల్ల అధిక నష్టం జరగకుండా చూశారని తెలిపారు. అలాగే మన నియోజకవర్గంలో ముఖ్యంగా ప్రాణనష్టం జరగకుండా కాపాడగలిగామని ఆయనకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. రాజవొమ్మంగిలో ఇటీవల అనారోగ్యంతో వైద్యం చేయించుకున్న చల్లా వీరభద్రరావుకి రూ.1,36,438లు ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కు అందజేశారు.

ఈ కార్యక్రమంలో ఆమె వెంట ఎఎంసి చైర్మన్ లోతా లక్ష్మణరావు, రాష్ట్ర ఇండస్ట్రీయల్ మరియు ఇన్ఫ్రాస్ట్రక్చర్ డైరెక్టర్ గొల్లపూడి పెద్దిరాజు, మాజీ మండలంపార్టీ అధ్యక్షులు గణజాల తాతారావు, దూసరపాము ఎంపీటీసీ నల్లా సత్తిబాబు, సొసైటీ అధ్యక్షులు పాము అర్జున్, మండలం పార్టీ అధ్యక్షులు పల్లాల వెంకటరెడ్డి, రాష్ట్ర రైతు విభాగం నాయకులు కనిగిరి రాంబాబు, గొర్లె సాగర్, బాలయోగి, బీజేపీ రాష్ట్ర కార్యదర్శి స్వప్న కుమారి, జనసేన రాజవొమ్మంగి మండల అధ్యక్షులు బొదిరెడ్డి త్రిమూర్తులు, కింతాడ నానిబాబు, రాజవొమ్మంగి తహసీల్దార్ అల్లు సత్యనారాయణ, ఎంపీడీఓ లోకుల యాదగిరీశ్వర రావు తదితరులు పాల్గొన్నారు.

# బ్రెయిన్ స్ట్రోక్‌కు తక్షణ చికిత్స అవసరం

**– డాక్టర్ బెజవాడ కామరాజు**



**కాకినాడ, మేజర్ న్యూస్ :** బ్రెయిన్ స్ట్రోక్ వచ్చిన రోగికి నాలుగున్నర గంటల్లోపు న్యూరాలజిస్ట్ ను సంప్రదించి వైద్య చికిత్స అందిస్తే త్వరగా కోలుకుంటారని ప్రముఖ న్యూరాలజిస్ట్ డాక్టర్ బెజవాడ కామరాజు పేర్కొన్నారు. స్థానిక సర్పవరం జంక్షన్‌లో కాకినాడ ఐడిఎ మరియు అడబాల ట్రస్ట్ ఆధ్వర్యంలో ప్రపంచ బ్రెయిన్ స్ట్రోక్ నివారణ దినోత్సవం పురస్కరించుకుని జరిగిన అవగాహన కార్యక్రమాన్ని ఉద్దేశించి ఆయన మాట్లాడారు. బ్రెయిన్ స్ట్రోక్ అంటే రక్త ప్రవాహం ఆగిపోవడం లేదా మెదడులో రక్తస్రావం జరగడం అన్నారు.

ఇలా జరిగినప్పుడు మెదడులోని కణాలు కొన్ని నిమిషాల్లోనే చనిపోవడం జరుగుతుందన్నారు. ఆ సమయంలో శరీరంలో ఒకవైపు పక్షవాతం రావడం, మాటలు తడబడటం, చూపు మందగించడం జరుగుతుందన్నారు. అధిక రక్తపోటు, మధుమేహం, అధిక కొలెస్ట్రాల్, మానసిక ఒత్తిడి, మద్యపానం, ధూమపానం, శారీరక వ్యాయామం లోపించడం వంటి కారణాల వలన బ్రెయిన్ స్ట్రోక్ వస్తుందన్నారు. దీని నివారణకు రక్తపోటు, మధుమేహం, కొలెస్ట్రాల్‌ను అదుపులో ఉంచాలన్నారు. మానసిక ఒత్తిడి ఉండరాదన్నారు. ఉప్పు, చక్కెరను పరిమితంగా తీసుకోవాలన్నారు. పండ్లు, కూరగాయలు ఎక్కువగా తీసుకుంటూ రోజు శారీరక వ్యాయామం చేయాలని డాక్టర్ కామరాజు తెలిపారు. అనంతరం అడబాల రత్న ప్రసాద్ ఆధ్వర్యంలో డాక్టర్ కామరాజును ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ అడ్డాల సత్యనారా యణ, నిమ్మకా యల వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

# సమన్వయంతో తుఫాను సహాయక చర్యలు

**– ప్రాణనష్టాన్ని తగ్గించాం.. ప్రజలకు భరోసా కల్పించాం**
**– పునరావాస శిబిరాల్లో ఉన్నవారికి ఆర్థిక సహాయం, నిత్యవసరాలు**
**– మంత్రి వాసంశెట్టి సుభాష్**



**రామచంద్రపురం, మేజర్ న్యూస్ :** రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ముందుచూపు, వాతావరణ శాఖ హెచ్చరికలు, అధికార యంత్రాంగం సమన్వయంతో మొంథా తుఫాన్‌ను సమర్థవంతంగా ఎదుర్కొన్నామని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ పేర్కొన్నారు. బుధవారం ఆయన ఓదూరు గ్రామంలో తుఫానుకు నేలవారిన పంట పొలాలను పరిశీలించిన అనంతరం మీడియాతో మాట్లాడారు. తుఫాను పట్ల వాతావరణ శాఖ ముందే హెచ్చరికలు జారీ చేసిన నేపథ్యంలో కూటమి ప్రభుత్వం అధికార యంత్రాంగాన్ని, ప్రజలను అప్రమత్తం చేయడం ద్వారా ప్రాణా నష్టం జరగకుండా కాపాడుకున్నాం అన్నారు. తుఫాను ముందస్తు చర్యలతోపాటు, 8 నెలలు దాటిన గర్భిణీ స్త్రీలను హాస్పిటల్స్‌లో చేర్చడం, వృద్ధులు పిల్లలు పట్ల ప్రత్యేక శ్రద్ధ, లక్షల మందిని తుఫాను సహాయక శిబిరాల్లో చేర్చి వారికి అన్ని సదుపాయాలు కల్పించడం, 24/7 నిరంతరం సీఎం చంద్రబాబు, మంత్రులు, ఎమ్మెల్యేలు, అధికార యంత్రాంగం అందరూ పరిస్థితులు సమీక్షిస్తూ జాగ్రత్తలు తీసుకోవడం వల్ల నష్టాన్ని తగ్గించ గలిగామన్నారు. ఇది ఖచ్చితంగా సీఎం చంద్రబాబు నాయుడు లాంటి అత్యంత సమర్ధ నాయకుడు మైక్రో లెవెల్ మేనేజ్మెంట్ చేయగలగడం వల్లనే సాధ్యమైంది అన్నారు.

అలాగే పునరావాస కేంద్రాల్లో తలదాచుకున్న వారికీ కూటమి ప్రభుత్వం ఒక్కొక్కరికి మూడు వేలు ఆర్థిక సహాయం, 25 కేజీల బియ్యం, కేజీ కందిపప్పు, కేజీ ఆయిల్, కేజీ పంచదార, కేజీ బంగాళదుంపలు, కేజీ ఉల్లిపాయలు వంటి నిత్యవసరాలు ఇచ్చేందుకు నిర్ణయించిందన్నారు. తుఫాను కారణంగా పనులు లేని కుటుంబాలకు ఆర్థిక సహాయం ఉపాయోగ కరంగా ఉంటుందన్నారు. అలాగే మత్స్యకారులకు, చేనేత కార్మికులకు 50 కేజీల బియ్యం ఇస్తామని మంత్రి సుభాష్ తెలిపారు. ఈ కార్యక్రమంలో కూటమి పార్టీ సీనియర్ నాయకులు వాసంశెట్టి సత్యం, పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

**ఏలేశ్వరంలో ఏలేరు రిజర్వాయర్ ప్రాజెక్ట్‌ను సందర్శించిన ఎంపీ సానా సతీష్, ఎమ్మెల్యే వరుపుల సత్య ప్రభ, జిల్లా టిడిపి అధ్యక్షులు జ్యోతుల నవీన్**





**ఏలేశ్వరం, మేజర్ న్యూస్ :** మొంథా తుఫాను నేపథ్యంలో నిండుకుండలా ఉన్న ఏలేశ్వరం జలాశయాన్ని స్థానిక ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ,జిల్లా అధ్యక్షుడు జ్యోతుల నవీన్, సంబంధిత అధికారులతో కలిసి రాజ్యసభ ఎంపీ సానా సతీష్ బాబు పరిశీలించారు. సహాయక చర్యలు చేపట్టి సమర్ధవంతంగా పనిచేసిన అధికారులని, సిబ్బందిని ఎంపీ సానా సతీష్ అభినందించారు. ఏలేరు జలాశయం దిగువన ఉన్న ముంపు ప్రాంతాలకు శాశ్వత పరిష్కారం దిశగా కృషి చేస్తామని ఎంపీ అన్నారు. మీడియా ప్రతినిధి వివరాలు అడగగా ఏలేరు ఆధునీకరణ ఎప్పటి కప్పుడు వాయిదాల పర్వం కొనసాగు తోందని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ దృష్టికి తీసుకెళ్ళి ఆధునీకరణ పరిష్కారం చేస్తామని ఎంపీ అన్నారు. ఈ కార్యక్రమంలో అధిక సంఖ్యలో కూటమి నాయకులు పాల్గొన్నారు.

## ఏలేరు వరద ప్రభావిత ప్రాంతాల్లో పర్యటించిన ఎంపీ సానా సతీష్



**జగ్గంపేట, మేజర్ న్యూస్ :** స్థానిక రావులమ్మ నగర్ లోని తెలుగుదేశం పార్టీ కార్యాలయానికి రాజ్యసభ సభ్యులు సానా సతీష్ చేరుకుని కాకినాడ జిల్లా టిడిపి అధ్యక్షులు జ్యోతుల నవీన్ , జగ్గంపేట నియోజకవర్గం తెలుగుదేశం పార్టీ ముఖ్య నాయకులతో కలిసి ఏలేరు వరద ప్రభావిత ప్రాంతాలను పరిశీలించేందుకు బయలుదేరి వెళ్లారు. ఈ సందర్భంగా జగ్గంపేట పార్టీ కార్యాలయంలో జగ్గంపేట నియోజకవర్గంలో వరదల వల్ల నష్టపోయిన రైతులు, ప్రజల వివరాలు తెలుసుకుని ప్రభుత్వం ద్వారా నష్టపరిహారం అందించే విధంగా చర్యలు చేపడతామని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ ఎస్ అప్పలరాజు, ఏలేరు ప్రాజెక్టు కమిటీ చైర్మన్ బస్వా వీరబాబు, తోట గాంధీ, జీనుమణి బాబు, కొత్త కొండబాబు, వీరం రెడ్డి కాశిబాబు, పైడిపాల సూరిబాబు, జాస్తి వసంత్, భూపాలపట్నం ప్రసాద్, అనుకుల శ్రీకాంత్, తోట గాంధీ, కొండ్రుతూ శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

## పాదగయ క్షేత్రాన్ని దర్శించిన హైకోర్ట్ న్యాయవాది కొమ్మన సతీష్

**– తన మిత్ర బృందంతో కలిసి ఆలయంలో ప్రత్యేక పూజలు**





**పిఠాపురం, మేజర్ న్యూస్ :** పిఠాపురం ప్రముఖ పుణ్యక్షేత్రం కుక్కుటేశ్వర స్వామి దేవస్థానాన్ని హైకోర్టు న్యాయవాది, ఉమ్మడి తూర్పు, పశ్చిమగోదావరి జిల్లాల సూర్య బ్యూరో & ఇంచార్జ్, జర్నలిస్ట్ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు కొమ్మన సతీష్ తన మిత్ర బృందంతో కలిసి దర్శించుకున్నారు. స్వామి, అమ్మ వార్లను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. శివ మాలధారణలో స్వామి అమ్మవార్లను దర్శించుకోవడం సంతోషంగా ఉందని, తెలుగు రాష్ట్రాల ప్రజలు సుఖ శాంతులతో వర్ధిల్లాలని కోరుకున్నట్లు ఆయన తెలిపారు. ఆలయ అభిషేక పండితులు చంద్రమౌళి ఆలయ విశిష్టతను వివరించారు. వేద పండితులు అభిషేక ఆశీర్వచనములు అందజేశారు.